TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
గురువారం, అక్టోబర్ 08, 2026 | సంపుటి - 20 | సంచిక 364 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

తెలంగాణను అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి: సీఎస్

హైదరాబాద్ : పెట్టుబడూటులను ఆకర్షించేందుకు సమన్వయంతో సమర్ధవంతమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని సీఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన సచివాలయంలో బుధ వారం నిర్వహించారు. తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చి ఓదిద్దడమే లక్ష్యమని వ్యాఖ్యానించారు. 2లో

12 అజెండా అంశాలకు ఏపీ కేబినెట్ ఆమోదం

డైట్ ఛార్జీల పెంపునకు గ్రీన్ సిగ్నల్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన సమావేశంలో 12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రస్థానంపై అభినందనలు తెలియజేస్తూ మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. హార్టీకల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు ప్రతిపాదనకు, ఒపల్లె 30 పడకల సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడేషన్ కు రూ. 58.42 కోట్లు కేటాయిస్తూ అదనంగా 66 పోస్టుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

ఏపీలో ఓటర్ల జాబితాపై ప్రత్యేక డ్రైవ్

తొలగించిన ఓట్లపై రీ - వెరిఫికేషన్ చేస్తాం: ఏపీ సీఈవో

అమరావతి : ఓటర్ల జాబితా పున:పరిశీలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రకటించారు. తొలగించిన 46.62 లక్షల పేర్లను ఇంటింటికెళ్లి పరిశీలిస్తామని పేర్కొన్నారు. రేపటి నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లనున్నారని తెలిపారు. తొలగించిన ఓటర్ల పరిస్థితిపై మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని వెల్లడించారు. మరణం, శాశ్వత వలస, డూప్లికేట్ నమోదులతో ఓటర్లను తొలగించినట్లు స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ గణనలో 44,89,512 మంది ఓటర్లు అందుబాటులో లేరని గుర్తించామని అన్నారు. జులై 31వ తేదీన 3,71,38,182 మంది 2లో

తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ

19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు.

హైదారాబాద్ : ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగ దారులకు నిరంతరా యంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం 2లో

దసరా పండుగకు 7వేల ప్రత్యేక బస్సులు

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం!

ప్రత్యేక బస్సుల ఛార్జీలలో మార్పు

హైదారాబాద్ : దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, తరువాయి 2లో

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ

ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక

ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం

ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!!

'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి

ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు

ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి. ప్రపంచ ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. 2లో

ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హెచ్చరించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

సైబర్ మోసాలు చేస్తున్న 101 మంది అరెస్ట్

హైదారాబాద్ : ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇస్తే డబ్బులు వస్తాయి.. కమీషన్ తీసుకోండి.. ఈజీ మనీ! సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో ఇలాంటి మెసేజ్‌లు చూసి చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ ఇలాంటి చిన్న ఆఫర్లే చివరకు భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో భాగం చేసే ప్రమాదం ఉంది. తరువాయి 2లో

నాకు ప్రజలే భగవంతుడి స్వరూపం

పిఎం నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ : ప్రజాసేవలో విమర్శలు సహజమేనని, వాటిని పట్టించుకుంటే ముందుకు సాగలేమని పిఎం నరేంద్ర మోడీ తెలిపారు. తనని ఎంతగా విమర్శిస్తే.. తాను అంతగా ఆలోచించేవాడినని, తనని సమర్థించినవారు విశ్వాసం శక్తిని చూపించారని, తనని వ్యతిరేకించినవారు ప్రజాస్వామ్యం శక్తిని నేర్పించారని అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసమే తనకు అతిపెద్ద బలమని, సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధ్యమే అని స్పష్టం చేశారు. తనను వ్యక్తిగతంగా విమర్శించేవారి విజ్ఞతకే ఆ విషయాన్ని వదిలేస్తానని, రాజకీయంగా తనను మరింత బలోపేతం చేసింది ప్రత్యర్థులేనని వివరించారు. 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి 2లో

యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదారాబాద్ : తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. 2లో

తెలంగాణను అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి: సీఎస్

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎస్ ఆదేశించారు. తెలంగాణను అగ్రగామిగా నిలపాలి.. పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు కల్పించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి కాలపరిమితిలో కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పెట్టుబడుల ప్రక్రియను వేగవంతం చేయాలని మార్గనిర్దేశం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదిక కానుందని వెల్లడించారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్కుల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు. మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలి
ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 07 : రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, శశాంక, అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వరంగల్‌లో మైనర్ల హల్‌చల్

తల్వార్‌తో బైక్‌పై తిరుగుతున్న యువకులు

వరంగల్, అక్టోబర్ 07 : నగరంలో ఆకతాయిల ఆగడాలు కలవరపెడుతున్నాయి. తాజాగా నలుగురు మైనర్లు ఒకే బైక్‌పై తిరుగుతూ.. చేతిలో తల్వార్‌తో హల్‌చల్ చేసిన ఘటన కలకలం రేపింది. కరీమాబాద్‌లోని వీరన్నగుడి ప్రాంతంలో తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.వీరన్నగుడి ప్రాంతంలో నలుగురు యువకులు ఒకే బైక్‌పై తిరుగుతూ హడావుడి చేసినట్లు వైరల్ అవుతున్న వీడియోలో కనిపిస్తోంది. వారిలో ఓ వ్యక్తి చేతిలో తల్వార్ పట్టుకుని ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. తమను చూసి మొరుగుతున్న వీధికుక్కలపై తల్వార్‌తో దాడికి యత్నించినట్లు వీడియోలో ఉన్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికుల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. ఘటనపై పోలీసులు దృష్టి సారించి.. వీడియోలో కనిపిస్తున్న యువకులు ఎవరనే దానిపై ఆరా తీస్తున్నారు. వారు మైనర్లేనా? ఈ తరహా ఘటనలకు గతంలోనూ పాల్పడ్డారా? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. వరంగల్ నగరంలో ఆకతాయిలు, పోకిరీల దౌర్జన్యాలకు సంబంధించిన ఘటనలు గతంలోనూ వెలుగుచూశాయి. ఇటీవల ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న కొందరు యువకులను ఓ వ్యక్తి ప్రశ్నించడంతో.. అతడిపై నడిరోడ్డుపై దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి రావడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. తాజాగా తల్వార్‌తో మైనర్లు హల్‌చల్ చేసిన ఘటన వెలుగులోకి రావడంతో నగరంలో యువత ప్రవర్తనపై మరోసారి చర్చ మొదలైంది. వేధింపులు, హల్‌చల్‌పై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. మైనర్ల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పోలీసులు సూచిస్తున్నారు.

దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు

గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజిఎస్‌ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరా కు నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ రెగ్యులర్ , స్పెషల్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి స్పష్టం చేశారు. టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణీకులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహించిన భారీ మల్టీ-స్టేట్ ఆపరేషన్ ఇప్పుడు ఇదే విషయాన్ని బయటపెట్టింది. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 18 మంది మహిళలు సహా 101 మంది నిందితులు అరెస్టయ్యారు. వీరి ద్వారా సుమారు 17 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అసలు ఈ నెట్‌వర్క్‌లో ముఖ్యమైన పాత్ర పోషించింది మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్. అంటే.. సైబర్ మోసగాళ్లు తమ పేర్లపై కాకుండా ఇతరుల బ్యాంక్ ఖాతాలను డబ్బులు స్వీకరించడానికి, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించుకోవడం. ఇందుకోసం కొందరు ఏజెంట్లు కమీషన్ తీసుకుని బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సమకూర్చినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన 101 మందిలో 19 మంది ఏజెంట్లు, 81 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఉన్నారు. అంటే నా అకౌంట్ మాత్రమే కదా.. నేను ఏం చేశాను? అనే నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ కేసు చెబుతోంది. అంతేకాదు.. ఈ నిందితుల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే సైబర్ క్రైమ్ అంటే కేవలం చదువు లేని వాళ్లు లేదా నిరుద్యోగులే చేస్తారనే అపోహ కూడా తప్పని అర్థమవుతోంది. అరెస్టయిన వారిలో వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, డ్రైవర్లు, సేల్స్-మార్కెటింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఒక టాటా క్యాపిటల్ ఉద్యోగి కమీషన్ కోసం సైబర్ మోసగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సమకూర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఒక ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి తన బ్యాంక్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపయోగించేందుకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడికి దేశవ్యాప్తంగా 50 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇంకొకరికి 60 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 101 మందిలో 50 మందికి దేశవ్యాప్తంగా ఐదుకు పైగా నేర సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో మరో షాకింగ్ విషయం కూడా బయటపడింది. మ్యూల్ అకౌంట్ల ద్వారా వచ్చిన డబ్బును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేయడం, ఇతర ఖాతాలకు బల్క్ ట్రాన్స్‌ఫర్లు చేయడం, విదేశీ లావాదేవీలకు ఉపయోగించడం వంటి మార్గాల్లో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పనికి అకౌంట్ హోల్డర్లు, మధ్యవర్తులకు మోసపూరిత మొత్తంలో 5 శాతం వరకు కమీషన్ ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంటే సోషల్ మీడియాలో కనిపించే 'అకౌంట్ ఇవ్వండి.. కమీషన్ తీసుకోండి' అనే ఈజీ మనీ ఆఫర్ వెనుక ఎంత పెద్ద నెట్‌వర్క్ ఉండొచ్చో ఊహించుకోవచ్చు. ఈ ఆపరేషన్‌లో ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 51 కేసులకు సంబంధించి అరెస్టులు జరిగాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,172 నేర సంబంధాలు గుర్తించగా, అందులో 206 తెలంగాణకు సంబంధించినవిగా గుర్తించారు. ఇక యువత ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఓటీపీ, సిమ్, కేవైసి వివరాలు, సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా నేరగాళ్లకు ఆయుధాలుగా మారొచ్చు. పార్ట్‌టైమ్ జాబ్, ఇన్‌స్టంట్ ఇన్‌కమ్, ట్రేడింగ్ ప్రాఫిట్, క్రిప్టో రిటర్న్స్, టాస్క్ కంప్లీట్ చేసి డబ్బు సంపాదించండి అంటూ వచ్చే ప్రతి ఆఫర్ నిజం కాదు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులు, కస్టమ్స్, కొరియర్ అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలి. ఎవరైనా మీ అకౌంట్‌ను ఉపయోగించుకోవడానికి కమీషన్ ఆఫర్ చేసినా.. ఒక్కసారి మాత్రమే అని చెప్పినా.. ఒప్పుకోకండి. ఎందుకంటే మీ అకౌంట్‌లో జరిగిన ట్రాన్సాక్షన్‌కు మీరు కూడా సమాధానం చెప్పాల్సి రావచ్చు. తెలియని లింకులపై క్లిక్ చేయకండి, ఓటీపీలు లేదా బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ చెప్పకండి, సోషల్ మీడియాలో వచ్చిన అకౌంట్లకు డబ్బులు పంపకండి. ఏదైనా సైబర్ మోసం జరిగితే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేయండి ఫిర్యాదు చేయండి. ఈ ఆపరేషన్ చెప్పే అసలు మెసేజ్ ఒక్కటే.. ఈజీ మనీ అనిపించే ప్రతి ఆఫర్.. ఈజీ మనీ కాకపోవచ్చు. ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇవ్వడం కూడా మీ జీవితాన్ని సైబర్ క్రైమ్ కేసులోకి లాగొచ్చు.

యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. "హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. "ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు. డిఇ షా నియోపోలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు. "నియోపోలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు. కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. "ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. "డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు

జాబితాలో పలువురు భారతీయులు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : అమెరికా ప్రభుత్వం పౌరసత్వం విషయంలో కీలక చర్యలు చేపట్టింది. తప్పుడు వివరాలు ఇచ్చి లేదా తమ గతాన్ని దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందిపై పౌరసత్వం రద్దు చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించింది. వీరిలో భారతీయుడు కూడా ఉన్నారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' చర్యగా న్యాయశాఖ పేర్కొంది. అమెరికా పౌరసత్వాన్ని మోసం, చట్టవిరుద్ధ మార్గాల ద్వారా పొందిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దీంతో స్పష్టమవుతోంది. ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఈ 40 మందిపై సివిల్ కేసులు దాఖలయ్యాయి. వీరిలో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన సమయంలో తమకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. గూఢచర్యం నుంచి లైంగిక నేరాల వరకు వివిధ తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసాలను సహించబోమని స్పష్టం చేశారు. అమెరికా అధికారుల ప్రకారం బల్విందర్ సింగ్ రెండు వేర్వేరు గుర్తింపులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక గుర్తింపుతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆయన 2003లో మరో గుర్తింపుతో శాశ్వత నివాస హోదా (పర్మినెంట్ రెసిడెంట్) పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత 2009లో అదే రెండో గుర్తింపుతో అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే రెండు వేర్వేరు దరఖాస్తుల్లో నమోదైన వేలిముద్రలను పరిశీలించిన అధికారులు అవి ఒకే వ్యక్తివని గుర్తించినట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ జాబితాలో అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నారు. చైనాకు గూఢచర్యం చేశారనే ఆరోపణలతో ఆయన ప్రస్తుతం 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా వ్యక్తులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసం వంటి పలు ఆరోపణలు ఉన్నట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ 40 మందిలో ఒక్క దేశానికి చెందిన వారు మాత్రమే లేరు. మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియా సహా 20కి పైగా దేశాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. వీరిపై ఉన్న ఆరోపణలు, పౌరసత్వం పొందే సమయంలో వారు ఇచ్చిన సమాచారం ఇతర అంశాలను కోర్టులు పరిశీలించనున్నాయి. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం.. మోసం చేసి లేదా కీలకమైన సమాచారాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందినట్లు కోర్టులో రుజువైతే, వారి సహజీకృత పౌరసత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంది. పౌరసత్వం రద్దైన తర్వాత సంబంధిత వ్యక్తులను అమెరికా నుంచి బహిష్కరించే డిపోర్టేషన్ ప్రారంభం కావచ్చు. అయితే ఈ 40 మందిపై నమోదైన కేసులన్నీ ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఆరోపణలు కోర్టులో రుజువు కావాల్సి ఉంది.

బెంగళూరులో పేలిన ట్రాన్స్‌ఫార్మర్!

అమెజాన్ ఆఫీస్ సమీపంలో పేలుడు

బెంగళూరు, అక్టోబర్ 07 : బెంగళూరులో ఉదయం తీవ్ర కలకలం రేగింది. అమెజాన్ కార్యాలయం సమీపంలో ఉన్న ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి గాయపడగా, స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. బాగలూరు క్రాస్ వద్ద ఉదయం 9:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మహమ్మద్ అఫ్రోజ్ అనే వ్యక్తి ఫుట్‌పాత్‌పై నడుస్తుండగా, సమీపంలోని విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ఎంయూ) భారీ శబ్దంతో పేలింది. ఈ ధాటికి అఫ్రోజ్ కిందపడిపోగా, వెంటనే స్పందించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు క్షేమంగా ఉన్నాడని, ప్రాణాపాయం తప్పిందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటన యలహంక ఓల్డ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ప్రమాదంపై బెంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ (బెస్కాం) అధికారులు స్పందించారు. మీడియం-వోల్టేజ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లోని భాగమైన రింగ్ మెయిన్ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని, ఇలాంటి పేలుళ్లు చాలా అరుదుగా సంభవిస్తాయని తెలిపారు. తమ సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.

నాకు ప్రజలే భగవంతుడి స్వరూపం

తన ప్రజాసేవా ప్రస్థానం మొదలైందని మోదీ గుర్తు చేసుకున్నారు.ాఇంత సుదీర్ఘకాలం ప్రభుత్వాధినేతగా కొనసాగుతానని అప్పట్లో ఊహించలేదన్నారు. రాష్ట్ర ఎన్నికలైనా, సార్వత్రిక ఎన్నికలైనా ప్రజలు తనపై విశ్వాసం ఉంచారని తెలియజేశారు. తన 25 ఏళ్ల ప్రయాణంలో అండగా నిలిచిన దేశ ప్రజలకు, ఎన్డీఏ మిత్రపక్షాలకు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.. 25 ఏళ్ల ప్రజాసేవా ప్రయాణాన్ని గుర్తు చేసుకున్న మోదీ.. ప్రజలే తనకు అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ ఉదయం శ్రీ వినాయక మందిరంలో ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశ ప్రజల కోసం ప్రార్థించానని, మరింత శక్తి, సామర్థ్యంతో దేశానికి సేవ చేసే అవకాశం కల్పించాలని భగవంతుడిని కోరుకున్నట్లు చెప్పారు. తనకు ప్రజలే భగవంతుడి స్వరూపం అని తెలియజేశారు. తాను రాజకీయాల్లో రాణించాలనే వ్యక్తిగత ఆశయంతో పనిచేయలేదని మోదీ స్పష్టం చేశారు. తాను వ్యక్తిగత ఆశయం కోసం కాదు.. ఒక లక్ష్యం కోసం జీవించాను అని అన్నారు. భవిష్యత్తులో ఏ స్థాయికి చేరుకుంటానో కూడా తాను ఎప్పుడూ ఆలోచించలేదని పేర్కొన్నారు. మరిన్ని కనుగొనండి తాజా వార్తలు సేవ ఈ-పేపర్ సబ్‌స్క్రిప్షన్ వార్తల వీడియోలు ాాశ్రీంశీ =ముం - మరణం ఆమె దరికి చేరలేదు.. ప్రాణాంతక ఇంజెక్షన్ ఇచ్చినా బతికి బయటపడిన 50 ఏళ్ల మహిళ గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ పాలసీ పెరాలసిస్‌కు మరోపేరు గత ప్రభుత్వం అని వ్యాఖ్యానించారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించి తీరుతాం అని మోదీ మరోసారి ధీమా వ్యక్తం చేశారు. ఆత్మనిర్భర్ భారత్, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడం, అంతరిక్ష రంగంలో మరింత ముందుకు వెళ్లడం వంటి లక్ష్యాలను ప్రస్తావిస్తూ.. మనం సాధిస్తాం అనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు దేశం నాకు ఎంతో ఇచ్చిందని, అందుకే దేశమే తనకు ప్రథమ ప్రాధాన్యం అని మోదీ పేర్కొన్నారు. 25 ఏళ్లుగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అంటూ తన ప్రసంగాన్ని భావోద్వేగంగా ముగించారు.

ఏపీలో ఓటర్ల జాబితాపై ప్రత్యేక డ్రైవ్

ఓటర్లతో ముసాయిదా జాబితా విడుదల చేశామని ప్రస్తావించారు. నోటీసు దశలో మరో 1,73,071 మంది అనర్హులుగా గుర్తించామని సీఈవో వివేక్ యాదవ్ తెలిపారు. 46,62,583 మంది తొలగించిన ఓటర్ల జాబితాతో ఇంటింటికీ బీఎల్ఓలు వెళ్తారని చెప్పారు. పొరపాటున పేరును తొలగిస్తే ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకోవచ్చని సూచించారు. బీఎల్ఓల పరిశీలన అనంతరం నిరంతర సవరణలో అర్హులైన వారి పేర్లను చేరుస్తామని వెల్లడించారు. కొత్తగా అర్హత పొందిన వారు కూడా ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తీసివేయకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అర్హత లేని నమోదులను ఓటర్ల జాబితాలో లేకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని సీఈవో వివేక్ యాదవ్ తెలిపారు. ఈనెల(అక్టోబరు) 16వ తేదీన ఏపీలో ఎస్ఐఆర్-2026 తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. తుది జాబితా తర్వాత కూడా నిరంతర సవరణ ద్వారా ఓటర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబరు 1 అర్హత తేదీలుగా ప్రకటించారు. తదుపరి జనవరి 1ను అర్హత తేదీగా వార్షిక సంక్షిప్త సవరణ చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడమే తమ లక్ష్యమని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.

యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా

ఉత్తరప్రదేశ్, అక్టోబర్ 07 : ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అజయ్ రాయ్ స్థానంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ఆరాధన మిశ్రా మోనాను అధిష్ఠానం నియమించింది. రాష్ట్రంలో చేజారిన బ్రాహ్మణ ఓటు బ్యాంకును తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, దశాబ్దం క్రితం విఫలమైన పాత వ్యూహాన్నే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ఇటువంటి వ్యూహాన్నే అనుసరించింది. అప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచన మేరకు, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దింపింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 10 నుంచి 12 శాతం ఉన్న బ్రాహ్మణ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే పార్టీకి పూర్వవైభవం లభిస్తుందని అప్పట్లో అంచనా వేసింది. అయితే, ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, తీవ్రంగా బెడిసికొట్టడంతో కాంగ్రెస్ కేవలం ఏడు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మరోసారి అదే బాటలో పయనిస్తున్న కాంగ్రెస్‌కు, ఈసారి మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచే సవాళ్లు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

సాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష

విత్తనాలు, ఎరువుల సరఫరాపై పలు సూచనలు

హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున, రానున్న యాసంగిలో రైతులు వరికి బదులు తక్కువ నీటితో పండే పంటల వైపు మళ్లేలా చూడాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రబీ 2026-27 కార్యాచరణ ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు రైతులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలతో పాటు మంచి ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతూ తన ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యతను చూసుకున్న తరువాతే పంటను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్త ఈ యాసంగిలో ఎల్‌నినో వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాత స్థితి, ఉష్ణోగ్రతల అంచనాలను అధికారులకు వివరించారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలను వివరిస్తూ, భూగర్భ జలాల లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక, సాగు జరగాలని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలను దృష్టిలో ఉంచుకుని వరికి బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్య, నూనెగింజల, కూరగాయల పంటలకు అనువైన విత్తన కాలాలను కూడా వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి అనువైన పంట రకాలను సిఫార్సు చేశారు. యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో, సరిపడా అందుబాటులో ఉండేలా సరఫరా పరిస్థితిని కూడా కమిషనర్ సమీక్షించారు. రాష్ట్రంలో 2025-26లో 26 జిల్లాల్లో నత్రజని,భాస్వరం ఎరువుల వినియోగ నిష్పత్తులు జాతీయ సగటు (9.7 : 3.7 : 1) కంటే అధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్. జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్., ఉద్యానవన శాఖ సంచాలకులు డాక్టర్ యాస్మీన్ బాషా, ఐ.ఏ.ఎస్. పాల్గొన్నారు. వీరితో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు; ఇక్రిశాట్, క్రిడా, ఐఎండీ, ఐఐఆర్ఆర్, ఐఐఎంఆర్, ఐఐఓఆర్ సంస్థల శాస్త్రవేత్తలు; ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లా ఉద్యానవన అధికారులు మార్కెటింగ్ మరియు సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతన్న అరచేతిలో పరిష్కారం

కిసాన్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

మొబైల్ ఫోన్ ద్వారా సేవలకు మరో ముందడుగు

హైదరాబాద్, అక్టోబర్ 07 : వ్యవసాయ విస్తరణ అధికారి నుంచి కమిషనరేట్ స్థాయి అధికారుల వరకు రైతులకు ఇప్పటికే వ్యవసాయ విస్తరణ సేవలు అందుతున్నాయి. వీటికి అదనంగా, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అరచేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే సలహాలు పొందేందుకు వీలుగా కిసాన్ హెల్ప్‌లైన్ సెంటర్ మరో ముందడుగుగా నిలుస్తోంది. పంటకు తెగులు సోకినా, ఎరువు ఎంత వేయాలో తెలియకపోయినా, ప్రభుత్వ పథకం అందకపోయినా రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1800-180-1551 కు ఫోన్ చేస్తే చాలు. తెలుగులోనే తక్షణ సలహా, సమాచారం అందుతాయి. సేవలు ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు, వారంలో 7 రోజులూ అందుబాటులో ఉంటాయి. కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2004 నుంచి దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ కేంద్రం, తెలంగాణ రైతుల కోసం హైదరాబాద్లోని వ్యవసాయ కమిషనర్ మరియు సంచాలకుల కార్యాలయంలో పనిచేస్తోంది. సలహాలతో పాటు, వ్యవసాయ పథకాలకు సంబంధించిన రైతుల ఫిర్యాదులను కూడా ఇదే నంబర్ ద్వారా తెలియజేయవచ్చు. "రైతుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" ఇదే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉండగా, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో కేంద్రం సహాయపడుతుంది. ఈ సేవలు మారుమూల గ్రామాల్లోని ప్రతి రైతుకూ తెలిసేలా, క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులు తమ సందేహాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి ఈ టోల్ ఫ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐ.ఏ.ఎస్ సూచించారు.

యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా

ఉత్తరప్రదేశ్, అక్టోబర్ 07 : ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అజయ్ రాయ్ స్థానంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ఆరాధన మిశ్రా మోనాను అధిష్ఠానం నియమించింది. రాష్ట్రంలో చేజారిన బ్రాహ్మణ ఓటు బ్యాంకును తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, దశాబ్దం క్రితం విఫలమైన పాత వ్యూహాన్నే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ఇటువంటి వ్యూహాన్నే అనుసరించింది. అప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచన మేరకు, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దింపింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 10 నుంచి 12 శాతం ఉన్న బ్రాహ్మణ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే పార్టీకి పూర్వవైభవం లభిస్తుందని అప్పట్లో అంచనా వేసింది.

దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు

ఢిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం

జంతర్‌మంతర్ వద్ద విపక్ష ఎంపీల ఆందోళన!

రాహుల్, ప్రియాంక సహా విపక్ష ఎంపీలు అరెస్ట్

నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : ఢిల్లీలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విపక్ష ఎంపీల సమావేశం అనంతరం, ఈసీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతిపక్ష ఎంపీలు సిద్ధంకావడంతో ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీరును ఖండిస్తూ, ఆయన రాజీనామా డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు.జంతర్ మంతర్ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని, వాటిని తాను మెడల్స్ భావిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, 100 మెడల్స్ సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలుద్దామని 300 మంది వెళితే మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. దేశద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష ఎంపీలు బస్సుల్లో జంతర్‌మంతర్‌కు బయలుదేరగా, వారిని అడ్డుకోవడానికి వందలాది మంది భద్రతా బలగాలు మోహరించాయి. ఈ క్రమంలో జంతర్‌మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.ఢిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?" అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విపక్ష ఎంపీలను పోలీసులు అరెస్టు చేశారు. మల్లికార్జున ఖర్గేమంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ్య ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. 'మాపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతలా బెదిరించాలని చూసినా మేం భయపడేది లేదు. నవ్వుతూనే ముందుకెళ్తాం. ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలనుకుంటున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని, వారు గూండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని మండిపడ్డారు. ఇదే అంశంపై స్పందించిన మరో కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా- శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం తమ ప్రజాస్వామ్య హక్కు అని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ని ప్రస్తావిస్తూ జంతర్ మంతర్ నిరసన ప్రదేశమైనప్పుడు అక్కడికి కూడా ఎంపీలను అనుమతించకపోతే ఎక్కడ ఆందోళన చేయాలని ప్రశ్నించారు. ఇక సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సహా కేంద్ర ప్రభుత్వంపైనా తమ పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా వ్యాఖ్యానించారు. వరుసగా రెండో రోజు ప్రతిపక్షాల ఆందోళనసర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళన వరుసగా రెండో రోజు కొనసాగింది. మంగళవారం రోజు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత రాహుల్, ప్రియాంక గాంధీ సహా కొందరు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో నిరసన కొనసాగించారు. దాదాపు 9 గంటల పాటు ఆందోళన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇక బుధవారం మధ్యాహ్నం ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశపై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్ మంతర్‌వైపు ర్యాలీగా బయల్దేరారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలోని జంతర్ మంతర్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనేది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది.

మోదీ ప్రస్థానంపై ముస్లిం జమాత్ అధ్యక్షుడి ప్రశంసలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి వివక్ష లేకుండా సమాజంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్నాయని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ కొనియాడారు. పరిపాలనా రంగంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దేశంలోని ముస్లింలకు కూడా సమర్థవంతంగా అందుతున్నాయని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, "ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎలాంటి వివక్షకు తావులేకుండా పౌరులందరికీ మేలు చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాల ద్వారా ముస్లింలకు ప్రయోజనం చేకూరడం లేదని కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి" అని రజ్వీ పేర్కొన్నారు. "ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన ఇళ్లలో నిరుపేద ముస్లింలు కూడా లబ్ధి పొందారు. అదేవిధంగా రైతు సంక్షేమ పథకాల్లోనూ హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా అర్హులైన పేద రైతులందరికీ సాయం అందుతోంది. పౌరుల భద్రతను పర్యవేక్షించడం, వారి ఆర్థిక ఇబ్బందులను తొలగించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ప్రధాని మోదీ ఆ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు" అని ఆయన కొనియాడారు. ఇదే క్రమంలో, జునా అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి సైతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. దేశ సేవలో మోదీ చూపుతున్న నిరంతర అంకితభావాన్ని ఆయన కొనియాడారు. 25 ఏళ్ల సుదీర్ఘ పాలనా ప్రస్థానం దేశం పట్ల ఆయనకున్న అంకితభావానికి, దృఢ సంకల్పానికి నిదర్శనమని, ఇది అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో మంటలు

ఒక్కసారిగా ఆందోళనకు గురైన ప్రయాణికులు

యాదాద్రి జిల్లా బీబీనగర్ సమీపంలో ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 07 : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలో బుధవారం ఉదయం సిర్పూర్-కాగజ్‌నగర్ వెళుతున్న రైలులో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే, రైలు బీబీనగర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న క్రమంలో, ఒక బోగీ చక్రానికి బ్రేక్ లైనర్‌లు పట్టేయడంతో ఏర్పడిన రాపిడి వల్ల పొగలు, మంటలు చెలరేగాయి. దీనిని వెంటనే గమనించిన కో-పైలట్, లోకో పైలట్‌ను అప్రమత్తంచేయడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం సాంకేతిక సిబ్బంది అవసరమైన మరమ్మతులు పూర్తి చేయడంతో రైలు తిరిగి సిర్పూర్-కాగజ్‌నగర్‌కు బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రీ-లాంచ్ పేరుతో రూ.500 కోట్ల మోసం!

సంస్థ ఛైర్మన్ పై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు

తెల్లాపూర్, అక్టోబర్ 07 : తెల్లాపూర్‌లో ప్రీ-లాంచ్ ప్రాజెక్టు పేరుతో త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ సుమారు 350 మంది బాధితులు బుధవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులను ఆశ్రయించారు. ఫ్లాట్ల కోసం తమ నుంచి సుమారు రూ.500 కోట్లు వసూలు చేసి, నిర్మాణం చేపట్టకుండా మోసం చేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ ఫౌండర్-ఛైర్మన్ పసుపులేటి సుధాకర్‌తో పాటు ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుల కథనం ప్రకారం, 2021లో తెల్లాపూర్‌లో "త్రిపుర నిర్వాణ" పేరుతో ఓ భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టును త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ ప్రకటించింది. మార్కెట్ ధరల కంటే తక్కువకే ఫ్లాట్లు ఇస్తామని ప్రీ-లాంచ్ ఆఫర్‌తో ఆకర్షించడంతో, ఎంతోమంది తమ కష్టార్జితాన్ని ఈ ప్రాజెక్టులో పెట్టుబడిగా పెట్టారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బీడీఎల్ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు అధికంగా ఉన్నారు. డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా, ఇంతవరకు కనీసం పునాది పనులు కూడా మొదలుపెట్టలేదని బాధితులు వాపోతున్నారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన భూమిని తమకు న్యాయం చేయకుండా మరో నిర్మాణ సంస్థకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు తమ ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేశారు. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ తెల్లాపూర్ ప్రాజెక్టుపై కేసులు నమోదు కావడం ఇది మొదటిసారి కాదు. ఇదే ప్రాజెక్టుకు సంబంధించి 10 మంది కొనుగోలుదారుల నుంచి రూ. 5.68 కోట్లు వసూలు చేశారని ఆరోపిస్తూ ఈ ఏడాది మార్చిలో హైదరాబాద్ సీసీఎస్‌లో ఒక కేసు నమోదైంది. అంతకుముందు, 2025 నవంబర్‌లో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలోనూ 'త్రిపుర నిర్వాణ' పేరుతో చేపట్టిన ప్రాజెక్టులో 9 మంది ఇన్వెస్టర్లు రూ. 4.41 కోట్లు నష్టపోయామని ఫిర్యాదు చేశారు. ఈ కేసులతో పాటు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ-రెరా) ఎదుట కూడా త్రిపుర కన్‌స్ట్రక్షన్స్‌పై పలు ఫిర్యాదులు ఉన్నాయి. తూప్రాన్ సమీపంలోని 'త్రిపుర సుకృతి' ప్రాజెక్టుకు సంబంధించి రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ఫ్లాట్లు విక్రయించినట్లు గతంలో టీజీ-రెరా నిర్ధారించింది. ఈ లావాదేవీలపై విచారణ జరిపి, తమ డబ్బును తిరిగి ఇప్పించాలని వారు పోలీసులను వేడుకున్నారు. కాగా, బాధితులు ఆరోపిస్తున్న రూ.500 కోట్ల సంఖ్యపై పోలీసుల దర్యాప్తు తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

శివ రాజ్ కుమార్‌కి తప్పిన ప్రమాదం..

చిత్రదుర్గ, అక్టోబర్ 07 : ప్రముఖ కన్నడ నటుడు శివ రాజ్ కుమార్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. తన కొత్త చిత్రం 'బెయిల్' ప్రమోషన్లలో భాగంగా కర్ణాటకలోని చిత్రదుర్గలో పర్యటిస్తున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. అభిమానుల మధ్య నుంచి థియేటర్‌లోకి వెళుతుండగా ఆయనకు అత్యంత సమీపంలో ఓ బాణసంచా ఒక్కసారిగా పేలింది. దీంతో ఆయన ఉలిక్కిపడ్డారు. వివరాల్లోకి వెళితే, చిత్రదుర్గలోని బసవేశ్వర థియేటర్ వద్దకు శివ రాజ్ కుమార్ రాగానే అభిమానులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఆయన థియేటర్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో స్వాగతం పలికేందుకు సిద్ధం చేసిన బాణసంచాలో ఒకటి ఆయన పక్కనే పేలింది. వెంటనే అప్రమత్తమైన శివరాజ్ కుమార్, నిప్పురవ్వల నుంచి తనను తాను కాపాడుకునేందుకు చేతులతో ముఖాన్ని, తలను కప్పుకున్నారు.

'రోడ్ డస్ట్' నియంత్రణకు ప్రత్యేక దృష్టి

సమన్వయంతో స్వచ్ఛ వాయు లక్ష్య సాధనకు టిజిపిసిబి కృషి

కాలుష్య మూలాల నిర్మూలనే లక్ష్యంగా విస్తృత కార్యక్రమాలు

వాయు నాణ్యత మెరుగుదలకు శాస్త్రీయ పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ

కాలుష్య మూలాల నియంత్రణకు ప్రభావవంతమైన చర్యలు

కాలుష్య మూలాల నియంత్రణపై సెక్రటేరియట్‌లో సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 07 : తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ(ఎక్యుఎంసి) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను కొనసాగిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ రోజు సెక్రటేరియట్ లో కమిటీ ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ గారి ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి గారు కమిటీ మెంబర్ కన్వీనర్ గా నిర్వహించిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ సమావేశం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆమోదించిన ఎక్యుఎంసి కార్యాచరణ ప్రణాళికలోని అంశాల పై చర్చించింది. సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, చీజూరా నోడల్ ఆఫీసర్ ప్రసాద్, జీహెచ్ఎంసి, సైబరాబాద్ మల్కాజ్గిరి కార్పొరేషన్ల కమిషనర్లు, నల్గొండ కలెక్టర్, సిడిఎంఎ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, టిజిఎస్ ఆర్ టిసి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి ట్రాఫిక్ కమిషనరేట్ల అధికారులు, టిజి ఐఐసి, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాల పై చర్చించిన తర్వాత ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఫలితాలను సమావేశం విశ్లేషించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద ఎక్యుఎంసి చేపడుతున్న కార్యక్రమాలను సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ ప్రసాద్ కమిటీ ఛైర్మన్ అహ్మద్ నదీమ్, టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ, కమిటీ మెంబర్ కన్వీనర్ రవి, కమిటీ సభ్యులకు వివరించారు. వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షించేందుకు 13 'నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించి, ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పొందేలా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. డేటాను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడానికి "ఎయిర్ క్వాలిటీ డ్యాష్ బోర్డు" అభివృద్ధి ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. సంబంధిత శాఖలకు అలర్ట్ ల ద్వారా వాయు నాణ్యతకు సంబంధించిన సమాచారం చేరవేస్తారు. అదేవిధంగా తక్కువ వ్యయంతో వాయు నాణ్యతను పర్యవేక్షించే 'లో కాస్ట్ సెన్సార్ల వినియోగాన్ని కూడా విస్తరిస్తున్నారు. టిజిపిసిబి ఆధ్వర్యంలో బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 ఎల్సిఎస్ లను ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్, క్రషింగ్ తదితర కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో, అలాగే నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో ఎల్సిఎస్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.పట్టణ వాయు కాలుష్యంలో ధూళికణాల కాలుష్యాన్ని నియంత్రించేందుకు రోడ్ డస్ట్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్ల మెరుగుదల, ఎండ్-టు-ఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, బహిరంగ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్లు వంటి చర్యలను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (చీజూరా) కింద చేపడుతున్నారు. మెకానికల్ రోడ్ స్వీపింగ్‌పై టిజిపిసిబి నిర్వహించిన అధ్యయన ఫలితాలను మూడు పట్టణ స్థానిక సంస్థల అధికారులకు వివరించేందుకు వర్క్ షాప్ నిర్వహించగా, సుమారు 100 మంది అధికారులు పాల్గొన్నారు. అధ్యయన సిఫారసులను రాబోయే సర్వీస్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోనున్నారు. వాహనాల ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, పీయూసి వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వాహనాల కొనుగోలు, అద్దెకు తీసుకునే వాహనాల్లో ఈవీ లకు ప్రాధాన్యత కల్పించే చర్యలు అమలయ్యాయి. పీయూసి వ్యవస్థను మరింత సమర్థవంతం చేసేందుకు రాష్ట్రంలోని 516 పీయూసి కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానం చేశారు. ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించినట్లు రవాణా శాఖ నివేదించింది. పీయూసి గడువు ముగిసిన వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ల విధానం అమలు చేసేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను స్వయంచాలకంగా గుర్తించే కెమెరాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. ఆర్టీసి ప్రస్తుతం జీహెచ్ఎంసి పరిధిలో 310 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. అదనంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్రానికి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. నల్గొండ, సంగారెడ్డి ప్రాంతాల్లో వాయు కాలుష్యానికి కారకమవుతున్న వివిధ మూలాలను శాస్త్రీయంగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐటీ బాంబే సమర్పించిన డ్రాఫ్ట్ తుది నివేదికను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మరింత మెరుగుపరచేందుకు టిజిపిసిబి, ఇతర నిపుణ సంస్థలు సూచనలు అందించాయి. ఈ అధ్యయన ఫలితాలను భవిష్యత్ కాలుష్య నియంత్రణ చర్యలకు ఉపయోగించనున్నారు. తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ కోసం స్టేట్ యాక్షన్ ప్లాన్ ను మరింత శాస్త్రీయంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి యునైటెడ్ నేషన్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రామ్ తో కలిసి ఉద్గారాల సమగ్ర లెక్కింపు పై చర్యలు చేపడుతున్నది. వివిధ శాఖల నుంచి అమలు నివేదికలను సేకరించి, రాష్ట్ర స్థాయి కార్యాచరణను మరింత సమర్థవంతంగా రూపొందించే ప్రక్రియ కొనసాగుతున్నది. అన్ని జిల్లాలకు జిల్లా స్థాయి అమలు కమిటీల పరిధిని విస్తరించే చర్యలు కూడా ప్రతిపాదనలు సమర్పించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు నాణ్యత పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు, నిర్మాణ ప్రాంతాలు, ఇతర ప్రధాన కాలుష్య ఉత్పత్తి ప్రాంతాల్లో పర్యవేక్షణకు సెన్సార్ వ్యవస్థలను విస్తరిస్తున్నారు. డీజిల్ జనరేటర్ సెట్ల నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రించేందుకు ఉద్గార నియంత్రణ పరికరాల అదనపు అమరిక లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, విద్యుత్ శాఖల సమన్వయంతో అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అవశేషాలను బహిరంగంగా దహనం చేయడం వల్ల వాయు కాలుష్యం పెరగకుండా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ అవశేషాలను బ్రికెట్లు, పెల్లెట్లుగా మార్చి సంప్రదాయ ఘన ఇంధనాలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా వినియోగించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బ్రికెట్ తయారీ యూనిట్ల ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైంది. 15వ ఫైనాన్స్ కమిషన్ కింద విడుదలైన నిధులను నిర్దేశిత వాయు కాలుష్య నియంత్రణ చర్యలకు సమర్థవంతంగా వినియోగించడంపై ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ ప్రత్యేకంగా సమీక్షించింది. హైదరాబాద్‌లో కింద విడుదలైన నిధుల్లో 90.27 శాతం, నల్గొండలో 82.5 శాతం, పటాన్‌చెరులో 100 శాతం, సంగారెడ్డిలో 76.43 శాతం వినియోగమైనట్లు సమీక్షలో వెల్లడైంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణలో నల్గొండకు రూ.4.83 కోట్లు, సంగారెడ్డికి రూ.2.42 కోట్లు, మొత్తం రూ.7.25 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో రహదారుల మెరుగుదల, పచ్చదనం, ఎలక్ట్రిక్ క్రిమెటోరియంలు తదితర వాయు నాణ్యత మెరుగుదల చర్యలకు వార్షిక కార్యాచరణ ప్రణాళికలు టిజిపిసిబి సిద్ధం చేసింది. చీజూరా దేశవ్యాప్తంగా 130 నగరాల్లో తొలిసారిగా నిర్వహించిన వార్డు స్థాయి స్వచ్ఛ వాయు పర్యవేక్షణ్ లో తెలంగాణకు గుర్తింపు లభించింది. నల్గొండలోని 16వ వార్డు కేటగిరి 3 (10 వేల జనాభా) కింద జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించి రూ.20 లక్షల పురస్కారం పొందింది.

సంపాదకీయం

భేతాళ కథల్లా బిఆర్‌ఎస్ అవినీతి!

కాళేశ్వరంపై కట్టుకథలు...ఫోన్ ట్యాపింగ్‌పై పిట్టకథలు...కారు రేసింగ్‌పై దబాయింపులు.. అప్పులపై కాలర్ ఎగవేతలు...ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అవినీతి కథలు భేతాళ కథల్లా తోసుకుని వస్తున్నాయి. కెసిఆర్ కుటుంబ పాలనలో జరగని అవినీతి లేదు. వారి బాగోతం అంతాఇంతా కాదు. అవన్నీ పక్కన పెట్టి మళ్లీ అధికారంలోకి రావడమెలా అన్నదే ఇప్పుడు వారు వేసుకున్న స్కెచ్. ప్రజలను మరోమారు బురిడీ కొట్టించాలి. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించాలి. ఈ పద్దతిలో బిఆర్‌ఎస్ రాజకీయాలు నడుస్తున్నాయి. పదేళ్లపాటు రాష్ట్రాన్ని అడ్డదిడ్డంగా పాలించి, అక్రమాలకు పాల్పడి, అవినీతిని మూటకట్టుకుని, అక్రమంగా వేలకోట్లు సంపాదించి...రాష్ట్రాన్ని దివాళా తీయించిన కెసిఆర్ కుటుంబం ఇప్పుడు కాంగ్రెస్‌ను ఎలా పడగొట్టాలా అన్న ఆలోచనలో పడింది. రేవంత్‌ను విమర్శించడం, కాంగ్రెస్‌ను విమర్శించడంపనిగా పెట్టుకున్నారు. గంట్‌ఓ అంశంతో తెరపైకి వస్తున్నారు. ఓ వైపు కెటిఆర్, మరోవైపు హరీష్ రావు..మధ్యలో కొందరు అప్పుడప్పుడూ వస్తుంటారు. వీరికంతా ఒకటే...విమర్శలతో ప్రభుత్వాన్ని బద్నాం చేయాలి. అర్జంటుగా గద్దెనెక్కాలి అన్న యావ. మరీముఖ్యంగా కెటిఆర్ ఈ విషయంలో చాలా తొందరగా ఉన్నారు. అందుకే మళ్లీ తమదే రాజ్యం అని విర్రవీగుతున్నారు. అవినీతిలో మునిగి తేలిని వారికి అధికారలేమి ఉక్కపోతగా మారింది. దీనిని భరించలేక పోతున్నారు. 18 నెలలు దాటడంతో ఇంకెంతకాలం అన్న రీతిలో అపసోపాలు పడుతున్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై అదేపనిగా విమర్శలు ఎక్కుపెడుతోంది. కాంగ్రెస్ అవినీతి చేస్తే విమర్శించాల్సిందే. కానీ అవినీతిపరులు కాదు. తమ అవినీతి బయట పడకుండా, తమ అక్రమాలు ప్రజలు గుర్తించకుండా ఎదురుదాడి మార్గాన్ని బిఆర్‌ఎస్ నేతలు ఎంచుకున్నారు. హరీష్‌రావు, కెటిఆర్, నిరంజన్ రెడ్డి, జగదీశ్ రెడ్డిలు ఇందులో ప్రధాన భాగస్వాములుగా రోజూ విమర్శలు తప్ప మరో పనిలేకుండా సాగుతున్నారు. నవ్విపోదురు గాక నాకేంటి అన్న చందంగా పదేపదే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విమర్శలు చేస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. విచారణలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వాటికి సమాధానం చెప్పే ధైర్యం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవినీతిని వెలుగులోకి తీసుకొస్తూనే ఉంది. రైతుబంధు కింద గుట్టలకు, వెంచర్లకు, హైవేలకు నగదును అందజేసిన ఘనత నాటి కెసిఆర్ ప్రభుత్వానిది. రైతుభరోసా కింద ఇప్పుడు అర్హులకే సాయాం అందించాలని సర్కార్ నిర్ణయించి అమలు చేస్తోంది. ఇలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అర్హులైన రైతులకే సాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా ఏదైనా పొరపాటు ఉందా లేదా అన్నది కూడా చూడకుండా భూతద్దం పెట్టి వెతికే పనిలో పడ్డారు. అప్పుడే బ్రహ్మాండం బద్దలు అయినట్లు.. తామంతా బంగారం తాపడం చేస్తే.. కాంగ్రెస్ వాళ్లు కరగనాకినట్లుగా గగ్గోలు పెడుతున్నారు. ప్రజలు వీరికి సిగ్గులేదా అని ఈసడించుకుంటున్న విషయాన్ని గమనించడం లేదు. అధికారమత్తులో పడ్డవారికి ప్రజల ఈజడింపులు కనిపించడం లేదు. ఉతికి ఆరేసినట్లు ఓడించినా బుద్ధి తెచ్చుకోవడం లేదు. కొందరు ఎమ్మెల్యేలు జారుకున్నారు. మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో క్రరుకాల్చి వాతలు పెట్టారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ఇంకా ఎలాంటి వాతలు పెడితే మార్పు వస్తుందో ప్రజలు గుర్తించి, ఆపని చేయాల్సి ఉంది. దాదాపు ఏడున్నర లక్షల కోట్లు అప్పులు చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో భారీ అవినీతికి పాల్పడ్డారు. అవినీతిపై విచరాణ జరక్కుండా కోర్టులకు ఎక్కారు. విచారణ జరపరాదని కోరుకున్నారు. విద్యుత్ ఒప్పందాలపై అవినీతి జరక్కుంటే ..కెసిఆర్ మహాశయుడు ఎందుకు విచారణ ఆపమన్నారో చెప్పడం లేదు. అవినీతి లేకుంటే బాజాప్తా కమిషన్ ముందు తన వాదన వినిపించ వచ్చు. కాళేశ్వరం అవినీతిలో ఇప్పటికే ఇంజనీర్లు పట్టుబడ్డారు. వారే వేలకోట్లు పోగేస్తే..ఇక అసలునాయకులు ఎంత బొక్కారో ప్రజలు గమనించాలి. ప్రజలు కేవలం కెసిఆర్ కుటుంబ అహంకారంతో విసిగిపోయి కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇక్కడ కాంగ్రెస్‌తో ప్రేమతో పట్టం కట్టలేదని గుర్తించాలి. ముందుగా అర్జంటుగా బిఆర్‌ఎస్‌ను సాగనంపే ప్రక్రియలో కాంగ్రెస్‌కు ఓటేశారు. ఈ విషయం తెలియకుండా ప్రజలు పొరపాటు కాంగ్రెస్‌కు ఓటేశారని ప్రజలను కూడా తప్పుపడుతున్నారు. నిజానికి కాంగ్రెస్ వారు అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం ఏడున్నల లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. ప్రతిపక్ష పార్టీల విమర్శలకు చెక్ పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంట్ బిల్లును ఉచితంగా అమలు చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్‌కు రూ.500లను కూడా అమలు చేస్తూ పేద ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది. కానీ బిఆర్‌ఎస్ నేతలు ఆరింట ఒక్కటే అమలవుతోందని గుడ్డిగా విమర్శలు చేసి నవ్వులపాలు అవుతున్నారు. ఇక అన్నింటిని మించిన రైతు రుణమాఫీకి కూడా శ్రీకారం చుట్టింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 'రైతు రుణమాఫీ' అమలుకు శ్రీకారం చుట్టారు. ఏకకాలంలో రుణమాఫీ చేసి చూపారు. 2014 ఎన్నికల్లో తెలంగాణలోని రైతులందరికి లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని కేసీఆర్ చెప్పారు. అధికారంలోకి వచ్చాక విడతల వారీగా రూ.25వేల రూపాయలు చొప్పున లక్ష వరకు చేశారు. అది కూడా అరకొర రైతులకే లబ్ధి చేకూరింది. కేంద్ర ప్రభుత్వం అందజేసే ఫసల్ బీమాను కూడా అహంకారపూరిత ధోరణితో కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేయలేదు. దీంతో పంట నష్టం వాటిల్లినప్పుడు ఎంతోమంది రైతులు ఆర్థికంగా చితికిపోయారు. తెచ్చిన అప్పులు కట్టలేక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాటిని కూడా గత ప్రభుత్వం దాచిపెట్టింది. రైతు బీమా కింద నగదును అందజేశారంటే ఎంతమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారో అర్థం అవుతుంది. ఇంతేగాక రైతులకు సంకెళ్లు వేసిన ఘనత కూడా మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది.ప్రాజెక్టుల రీడిజైన్, నూతన ప్రాజెక్టుల నిర్మాణాల పేరిట రైతుల నుంచి భూములు లాక్కుని వారిని బజారున పడేసిన పాపం కూడా బీఆర్‌ఎస్‌కే దక్కుతుంది. నష్ట పరిహారం అడిగితే లాఠీలతో సమాధానం చెప్పిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారు. అదేమంటే ఆస్తులు సమకూర్చామని చెబుతున్నారు. ఆస్తులు మాత్రం కెసిఆర్ కుటుంబసభ్యులు సమకూర్చుకున్నట్లుగా ఉంది. అప్పులను తగ్గించుకుంటూ..వడ్డీల భారన్నా తగ్గించేలా ప్రణాళికలు వేయాల్సిందే. అలా చేయకుంటే కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. అప్పులు తగ్గింఉకునే క్రమంలో కొన్న పథకాల అమలును కూడా సమీక్షించాలి. గుదిబండ పథకాలకు పాతరేయకుంటే తెలంగాణ మరింతగా అప్పుల్లో కూరుకుపోగలదు.

గురుకులాలను కాలగర్భంలో కలిపే కుట్ర

గురుకులాలు.. ఈ మాట వినగానే మనకు మొదట గుర్తుకువచ్చే పేరు తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించడానికి 1970లో నల్లగొండ జిల్లాలోని సర్వేల్‌లో మొదటి గురుకుల పాఠశాలను ఆయన స్థాపించారు. తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో ప్రాంతాలవారీగా మరో రెండు గురుకులాలు ఏర్పాటయ్యాయి. వీటిలో చదివిన చాలా మంది ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత పదవులను అలంకరించారు. గురుకులాలకున్న ప్రజాదరణ, వాటిలో ఉండే విద్యా ప్రమాణాలను గుర్తించిన ఎన్టీఆర్ సర్కారు ప్రతి జిల్లాలో బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున గురుకుల పాఠశాలలు మంజూరు చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన విద్యార్థులకు ఎస్టీ గురుకులాలు మంజూరయ్యాయి. 1995 వరకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో గురుకులాలదే హవా. ప్రతి నియోజకవర్గంలో విద్యార్థులకు కనీసం ఒక గురుకుల పాఠశాల అందుబాటులో ఉండేది. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా వాటిలో అడ్మిషన్లు ఇచ్చేవారు. విద్య ప్రైవేటీకరణ జరిగి కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయిన తర్వాత మార్కులు, ర్యాంకులు హైజాక్ అయ్యాయి. క్రమంగా గురుకులాలు ప్రభ కోల్పోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రెసిడెన్షియల్ పాఠశాలలకు పునర్ వైభవం తీసుకువచ్చారు. ఒకేసారి వందకు పైగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, 51 గిరిజన గురుకులాలను నెలకొల్పడమే కాకుండా, బీసీలు, మైనారిటీల కోసం కొత్తగా సొసైటీలు స్థాపించి, వాటి కింద 250 చొప్పున గురుకులాలను ఏర్పాటు చేయడంతో గురుకుల విద్య కొత్త శకానికి నాంది పలికారు. ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు గురుకులాలను నెలకొల్పడంతో రాష్ట్రంలో గురుకులాల సంఖ్య 1022కు చేరుకున్నది. వాటిలో సుమారు 5 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 2016 నుంచి కొత్తగా స్థాపించిన గురుకులాల్లో కొన్నింటికి కేసీఆర్ సర్కారు పక్కా భవనాలను కూడా నిర్మించింది. అన్నింటిలో ఐదు నుంచి ఇంటర్ వరకు తరగతులు నడుస్తుండగా, 2017లో గురుకుల సొసైటీల కింద డిగ్రీ కళాశాలలను కూడా ఏర్పాటు చేసి వినూత్నమైన కోర్సులకు శ్రీకారం చుట్టారు. ఇంకా సైనిక అధికారులను తయారు చేయడానికి సైనిక్ స్కూళ్లు, క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు స్పోర్ట్స్ స్కూళ్లను కూడా నెలకొల్పారు. సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని అగసార నందిని 2023 ఆసియా క్రీడల్లో దేశానికి కాంస్య పతకం సాధించి ఒక దిక్సూచిగా, ఆశాకిరణంగా నిలిచింది. గత 18 నెలలుగా గురుకులాలు మరో రకంగా వార్తల్లోకి ఎక్కడం బాధాకరం. ఫుడ్ పాయిజన్, ఇతర కారణాల వల్ల ఇప్పటికే 93 మంది విద్యార్థులు మరణించడం శోచనీయం. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. రకరకాల సమస్యల పరిష్కారానికి విద్యార్థులు రోడ్డునపడటం నిత్యం చూస్తున్నాం. ముఖ్యంగా పురుగుల బియ్యం, కుళ్లిన కోడిగుడ్లు, పాడైపోయిన కూరగాయలు సరఫరా చేస్తుండటంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. బిల్లులు విడుదల కాకపోవడంతో టెండరుదారులు నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నారు. బకాయిలను చెల్లించడం లేదని నిర్మాణంలో ఉన్న భవనాలను కాంట్రాక్టర్లు పూర్తిచేయడం లేదు. అధికారుల అలసత్వం, ప్రభుత్వ నిర్లక్ష్యపు నీడలో విద్యార్థులు దిక్కుతోచక, గత్యంతరం లేక అన్నీ భరిస్తున్నారు. గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన అంతంతమాత్రంగానే అందుతున్నదనేది విద్యార్థుల మరో ఆరోపణ. పాములు తదితర విషపురుగుల మధ్యన చదువుపై ఏకాగ్రత చూపడం విద్యార్థులకు సవాల్‌గా మారింది. విద్యార్థులు ఇలాంటి సమస్యలతో సహజీవనం చేస్తుండగా, ఉపాధ్యాయులు అసంతృప్తి నీడన బోధిస్తున్నారు. ఇక ప్రధానాచార్యుల సమస్యలు చెబితే భారతమంత, రాస్తే రామాయణమంత. పాఠశాలలు తెరిచి నెల రోజులు దాటినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. క్రమంగా గురుకులాలను నిర్వీర్యం చేస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పేరిట ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో కాంప్లెక్స్ నిర్మాణాలకు పూనుకోవడమే అందుకు కారణం. ఇది పూర్తిగా గురుకుల పితామహుడు పీవీ పేరును మరుగున పడవేస్తూ, గురుకులాల ప్రతిష్ఠను పునరుద్ధరించి, లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించిన కేసీఆర్ పేరుప్రతిష్టలను మసకబార్చే దుష్ట ప్రయత్నమే. పరిస్థితి ఇలాగే కొనసాగితే గురుకులాలు కాలగర్భంలో కలిసిపోతాయి. మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు?'.

కౌలు రైతులపై వివక్ష

హక్కుల కోసం రైతుల ఆందోళన

ఏలూరు,జూలై18 : వ్యవసాయం గిట్టుబాటుకాక, ప్రైవేటు అప్పులతో రుణగ్రస్తులై విధిలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న కౌల్దార్లను అసలు రైతులుగానే గుర్తించట్లేదు. పంటల ఉత్పత్తిలో, ఏపీలో 16 లక్షల మంది కౌలు రైతులుంటారని ప్రభుత్వమే లెక్కలేసింది. 20 లక్షలకు పైమాటేనని రైతుసంఘాలు చెబుతున్నాయి. కౌలు రైతులకు సంస్థాగత పరపతి కల్పించే విషయంలో ప్రభుత్వాల వైఫల్యం ఆనవాయితీగా వస్తుండగా కౌలు రైతులకు బ్యాంక్ రుణాలని ప్రతి ఏటా చెబుతున్నా అమలు కావడం లేదన్నారు. వ్యవసాయంలో మార్కెట్ శక్తుల ఆధిపత్యం పెరగడం, భూసంస్కరణలు జరగకపోవడం వలన ఏపీలో కౌలు రైతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అంచనా వేసిన మేరకైనా సర్కారు కౌలు రైతులను గుర్తించి బ్యాంకు రుణాలిప్పించిందా అంటే అదీ లేదు. కౌలు రైతులు తమ హక్కుల కోసం దశాబ్దాల తరబడి పోరాడుతున్నారు. తమకు కనీసం సంస్థాగత పరపతి, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరుతున్నారు. ప్రభుత్వాల చిన్నచూపునకు బ్యాంకుల సహాయ నిరాకరణ తోడవడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం కౌలు రైతులు పడుతున్న అగచాట్లు పడుతున్నారని కౌలురైతుల సంఘం నాయకుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు తీసుకుని వచ్చినా తమకు అండగా ఉండడం లేదన్నారు. రైతుల స్థితిగతులపై అధ్యయనం చేసిన జయతిఘోష్, కోనేరు రంగారావు కమిటీలు కౌల్దార్లకు బ్యాంక్ రుణాలిప్పించాలని సిఫారసు చేసినా పెద్దగా ఫలితం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కౌల్దార్లకు రుణ అర్హత కార్డు జారీకి చట్టం తెచ్చింది. భూయజమానితో సంబంధం లేకుండా రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. నేటికీ గ్రామాల్లో భూస్వాములు, పెత్తందార్ల ఆధిపత్యం కొనసాగుతున్నందున కౌల్దార్లుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదలకు కార్డులు రావట్లేదన్నారు. బ్యాంకులు కౌలు రైతుల రుణాలే ఎన్‌పిఏలుగా పేర్కొంటే ప్రభుత్వం కూడా దానిని అంగీకరించడం సరికాదని శ్రీనివాస్ అన్నారు. రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెట్టింది. వడ్డీ మాఫీ, వడ్డీ రాయితీ పథకాల గురించి చెప్పనవసరం లేదు. ఎల్ఇసి లేని వారికి సాగు ధృవీకరణ పత్రాలన్నా పెద్దగా ఉపయోగం లేదు.

ఛత్తీస్‌ఘడ్ మద్యం కుంభకోణం కేసు

మాజీ సిఎం బఘేల్ నివాసంలో ఇడి సోదాలు

సిఎం తనయుడు చైతన్య బఘేల్ అరెస్ట్

రాయ్‌పుర్,జూలై18 : ఛత్తీస్‌గఢ్‌లో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ఇడి దూకుడు పెంచింది. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ గట్టి షాకిచ్చింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన కుమారుడు చైతన్య బఘేల్‌ను ఈడీ శుక్రవారం అరెస్టు చేసింది. ఉదయం బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు.. అనంతరం చైతన్యను కస్టడీలోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం తో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో చైతన్య బఘేల్ పాత్ర ఉందని అభియోగాలు వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన ఈడీ.. మద్యం సిండికేట్‌కు రూ.రెండు వేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన దర్యాప్తు సంస్థ.. శుక్రవారం మరోసారి తనిఖీలు చేపట్టింది. ఈ ఉదయం దుర్గ్ జిల్లాలోని భిలాయ్ ప్రాంతంలో గల బఘేల్ నివాసానికి ఈడీ అధికారులు చేరుకున్నారు. కేసుకు సంబంధించి కొత్త ఆధారాలు లభించడంతో మాజీ సీఎం నివాసంలో సోదాలు చేపట్టారు. అయితే, ఈ సమయంలో చైతన్య బఘేల్ అధికారులకు సహకరించకపోవడంతో ఆయనను అరెస్టు చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నుంచి బఘేల్ నివాసం వద్ద పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది మోహరించారు. పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకొని ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా.. పుట్టిన రోజు నాడే చైతన్యను ఈడీ అధికారులు అరెస్టు చేయడం గమనార్హం. దీనిపై ఆయన తండ్రి భూపేశ్ స్పందించారు. 'రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు నేడు చివరి రోజు. అదానీ సంస్థ కోసం చెట్లు-కూలుస్తున్న అంశాన్ని మేం లేవనెత్తాం. వెంటనే మా ఇంటికి ఈడీని పంపించారు. నా కుమారుడి పుట్టిన రోజున మంచి బహుమతి ఇచ్చారని మాజీ సీఎం మండిపడ్డారు.

నేర్పరితనం ఉంటేనే రాణింపు!

తిరుమల : జీవితంలో నేర్పరితనం అవసరం. నేర్పు లేకుంటే మనుగడ సాగించడం కష్టం. ఔషధ సేవనంతో రోగవిముక్తి పొందవచ్చు. కాని, శత్రు విముక్తికి ఎలాంటి ఉపాయమూ లేదు.'అపకారికి ఉపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి' అన్నాడు సుమతీ శతకకారుడు. అంతటితో శత్రుత్వ నశిస్తుందనలేదు. నేర్పుగా ఎలా జీవించాలో చెప్పాడంతే. నేర్పు అంటే దుష్పరిణామాల నుంచి ఉపాయంగా తప్పించుకోవడం. పాము పడగవిప్పి కాటు వెయ్యాలని మీదకు దూకుతుంటే పాములు పట్టేవాడు ఎలా తప్పించు కుంటాడు? చివరకు పాము తలను దొరకబుచ్చుకుంటాడు... అదీ నేర్పు అంటే ఇలాంటి నేర్పు పొందాల్సిన అవసరం కల్పించే వాడే శత్రువు. మనకు కలిసివచ్చే కాలంలో సిరిసంపదలు, పేరు ప్రఖ్యాతులు వస్తే అకారణ శత్రువులు ఏర్పడతారు. డబ్బుతో పాటే మనలను వ్యతిరేకించే వారు పెరుగుతారు. అసూయాపరులు మనవైపే చూస్తుంటారు. వీరు ఎంత లౌక్యులంటే వారి చూపుల్లో గాని, ప్రవర్తనలోగానీ ఎక్కడా వారి క్షుద్రభావాలు వెల్లడి కావు. పంచదార పలుకులతో మనల్ని ప్రలోభ పెడతారు. పైకి మిత్రులు, ఆత్మీయులు. లోపల అసూయ లావా కుతకుతలాడుతున్న అగ్నిపర్వతాలు. అవకాశం లభిస్తే మొదటి అపకారం వీళ్లే చేస్తారు. చాటున మన గురించి తీవ్రమైన దుష్ప్రచారం చేస్తారు. మనల్ని ఏకాకుల్ని చేయడానికి మిత్ర, బంధువర్గాల్లో మనకున్న మంచి పేరు చెడగొట్టడానికి శతథా యత్నిస్తారు. సోమరిపోతు, నిద్రాప్రియుడు కూడా ఇంట్లోకి పాము ప్రవేశించిందనగానే అప్రమత్తమై వేయికళ్లతో పాము జాడల కోసం వెతుకు తాడు. కనిపించగానే వెర్రి ఆవేశంతో కర్రదెబ్బలు కొడతాడు. ఇక్కడ పామే శత్రువు. దాన్ని చంపకపోతే అది మనల్ని చంపేస్తుంది. అలాగని దానికి నేర్పరితనం కూడా అవసరమే. ఇది ఒంటబట్టిన వారు జీవితంలో నెగ్గుకు రాగలరు.



ఆధ్యాత్మికం

అమీన్ పూర్ ప్రభుత్వ విద్యారంగంలో సరికొత్త అధ్యాయం

● రూ.డేబై నాలుగు కోట్ల యాబై లక్షలతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన ● పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

సంగారెడ్డి జిల్లా: పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పటాన్ చేరు నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్ చేరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.ఇరవై ఐదు కోట్ల అంచనా వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం, సుల్తాన్‌పూర్‌లో ఒక ఎకరం పది గుంటల విస్తీర్ణంలో రూ.నలబై కోట్ల యాబై లక్షల. అంచనా వ్యయంతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలనిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ పటాన్ చేరు నియోజకవర్గంలోని తొమిది డివిజన్లలో రూ. మూడు వందల అరవై నాలుగు కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కొత్తగా నిర్మించనున్న పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆధునిక మౌలిక వసతులు, అవసరమైన విద్యా సదుపాయాలతో పాటు నాణ్యమైన బోధన అందించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. తద్వారా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. పటాన్ చేరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రతి విద్యార్థికి సమానమైన విద్యా అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణంతో పటాన్ చేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక వసతుల పరంగా

గణనీయమైన విస్తరణకు అవకాశం ఏర్పడనుంది. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించే దిశగా ఈ నిర్మాణ పనులు కీలకంగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు రాజు, భాస్కర్ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, టి జి ఈ డబ్ల్యు ఐ డి సి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ సుధాకర్, డిఈలు రాజు, వెంకటరమణ, ఏఈ వరుణ్ రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ జీపీఏతో భూముల అక్రమ విక్రయాలు.. ఐదుగురు అరెస్టు

మేడ్చల్, అక్టోబర్ 07: నకిలీ జీపీఏ, తప్పుడు స్థిరాస్తి పత్రాలను ఉపయోగించి విలువైన భూములను అక్రమంగా విక్రయించిన కేసులో ఐదుగురిని కీసర పోలీసులు అరెస్టు చేశారు. చెరియాల గ్రామంలోని సర్వే నంబర్ 94లో 18 ఎకరాల 19 గుంటల భూమికి సంబంధించి ఈ అక్రమ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు తెలిపారు. విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి తోటరెడ్డి వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2025 మే 15న క్రైం నంబర్ 414/2025గా కేసు నమోదైంది. ఫిర్యాదుదారు, మహమ్మద్ ఇక్బాల్ 1982లో అసలు యజమానుల నుంచి రిజిస్టర్ విక్రయ పత్రం ద్వారా భూమిని కొనుగోలు చేసి అప్పటి నుంచి స్వాధీనంలో ఉన్నారు. 2024 జూలై 6న భూమిని పరిశీలించేందుకు వెళ్లిన సమయంలో కొన్ని ప్లాట్లకు ఫెన్సింగ్ వేస్తుండటాన్ని గుర్తించారు. విచారించగా 2024లో రిజిస్టర్ చేసిన విక్రయ పత్రాల ద్వారా భూమిని కొనుగోలు చేసినట్లు కొందరు తెలిపారు. దీంతో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌ను పరిశీలించగా సయ్యద్ అఫ్జల్ 1988లో అసలు యజమానుల పేర్లతో నకిలీ జీపీఏ సృష్టించినట్లు గుర్తించారు. ఆ జీపీఏలోని ఫొటోలు, సంతకాలు, వేలిముద్రలు అసలు యజమానులవి కావని తెలిసినప్పటికీ నిందితులు వాటిని ఉపయోగించి భూముల విక్రయాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. సర్వే నంబర్ 94లోని ప్లాట్ నంబర్లు 21, 28, 38, 59, 129, 145లకు సంబంధించి విక్రయ పత్రాలు రిజిస్టర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కొన్ని ఆస్తులకు విక్రయ పత్రాలు, విక్రయ ఒప్పందాలు-- జీపీఏల ద్వారా లావాదేవీలు నిర్వహించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో బసరికారి శ్రీనివాస్‌రావు, బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మిర్ సాదిక్ అలీ, రామిడి సాతిరెడ్డిని అక్టోబర్ 7న అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రధాన నిందితుడైన శ్రీనివాస్‌రావు సయ్యద్ అఫ్జల్, బి.ఆనంద్, ఆర్.సాతిరెడ్డి, బి.వెంకటేష్ తదితరులతో కలిసి నకిలీ పత్రాల ఆధారంగా భూముల లావాదేవీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మిర్ సాదిక్ అలీ, రామిడి సాతిరెడ్డి వివిధ రిజిస్ట్రేషన్ పత్రాల్లో సాక్షులుగా సంతకాలు చేసి నగదు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ లావాదేవీలు అక్రమమని తెలిసినప్పటికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సహకరించినట్లు

పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో తటాకం నారాయణశర్మ, జూపల్లి రవీందర్ మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు నిందితుల విచారణలో వెల్లడవడంతో వారి పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ పత్రాల తయారీ, రిజిస్ట్రేషన్‌కు సహకరించిన వ్యక్తులు, కొనుగోలుదారులు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఏసీపీ ఎస్.చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేశ్, ఎస్ఐ ఎస్.అనిల్‌కుమార్, కానిస్టేబుల్ శ్రీధర్ దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్టు చేశారు. ఆస్తులు కొనుగోలు చేసే ముందు రెవెన్యూ రికార్డులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని వివరాలను పూర్తిగా పరిశీలించి యాజమాన్య హక్కులను నిర్ధారించుకోవాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద ఆస్తి లావాదేవీలు, నకిలీ పత్రాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జీలకుంట రైతులకు రహదారి వరం-ఏళ్ల నిరీక్షణకు తెర

● రూ.2.05 కోట్లతో బీటీ రోడ్డు ● చెరువు కట్ట నుంచి జగ్గయ్యపల్లి వరకు ● 1.65 కి.మీ. రహదారి నిర్మాణం ● ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ శ్రీమతి రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి

బ్యూరో,: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీలకుంట గ్రామ రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి సౌకర్యం ఎట్టకేలకు అందుబాటులోకి రానుంది. చెరువు కట్ట నుంచి జగ్గయ్యపల్లి వరకు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన దారి లేక రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వ విప్, శాసనసభ్యులు విజయ రమణారావు ప్రత్యేక

చొరవ తీసుకున్నారు. దీంతో రూ. 2.05 కోట్ల నిధులతో 1.65 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ భూములకు వెళ్లే దారి సక్రమంగా లేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత కష్టంగా మారేది. ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ వాహనాలను పొలాల వద్దకు తీసుకెళ్లడం కూడా ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో చెరువు కట్టపై నిర్మిస్తున్న బీటీ రోడ్డు రైతుల రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు రూ. 2.05 కోట్ల నిధులు మంజూరు చేయించి రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేసిన ఎమ్మెల్యే విజయ రమణారావుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ రైతుల చిరకాల వాంఛ నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని సర్పంచ్ మంగ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ రైతుల ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను గుర్తించి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. చెరువు కట్ట నుంచి జగ్గయ్యపల్లి

వరకు బీటీ రోడ్డు పూర్తయితే రైతులకు వ్యవసాయ భూములకు రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. గ్రామ అభివృద్ధి, రైతుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూ. 2.05 కోట్ల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే విజయ రమణారావుకు జీలకుంట గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ మంగ శ్రీనివాస్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర ఎక్సైజ్ అసోసియేషన్ ఎన్నికల్లో సౌకత్ అలీ విజయం

స్టేట్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక.. అభినందించిన పెద్దపల్లి ఎక్సైజ్ అధికారులు

పెద్దపల్లి ప్రతినిధి : తెలంగాణ ఎక్సైజ్ శాఖలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ స్టేషన్‌లో పనిచేస్తున్న పిడఈసీ ఉద్యోగి ఎస్కే సౌకత్ అలీ స్టేట్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయి అసోసియేషన్‌లో కీలక బాధ్యతలు చేపట్టడం పెద్దపల్లి జిల్లాకు గర్వకారణమని జిల్లా ఎక్సైజ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సౌకత్ అలీ పెద్దపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయనకు రాష్ట్రస్థాయిలో బాధ్యతలు దక్కడంపై ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సౌకత్ అలీ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా ఎక్సైజ్ శాఖకు మంచి పేరు, ప్రతిష్ఠలు తీసుకువచ్చే విధంగా పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అసోసియేషన్‌లో సౌకత్ అలీకి కీలక బాధ్యతలు దక్కడంపై పెద్దపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారులు, ఉద్యోగులు ఆయనను అభినందించారు.

కళాకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

పెద్దపల్లి ప్రతినిధి : తెలంగాణ ఉద్యమంలో తమ ఆట, పాటలతో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. బుధవారం రోజున పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలు ప్రకటిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పెట్టిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష కు సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిరుద్యోగ కళాకారులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, ప్రజలను చైతన్యపరిచారని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, కళాకారులు న్యాయమైన డిమాండ్ల కోసం నిరాహార దీక్షలు చేయాల్సి రావడం విచారకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి, వారి డిమాండ్లను పరిష్కరించకపోతే సిపిఐ పార్టీ తరఫున కళాకారుల పోరాటానికి అన్ని వేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సీపీఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు. ఎండి రజాక్, తుంగాని రాకేష్, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్ దబ్బేట పుష్పలత, రాష్ట్ర కల్చరల్ ఇంచార్జ కలవేని రాణి, రాష్ట్ర ఆర్గనైజర్ తెలంగాణ ఉద్యమ కళాకారుడు కన్నూరి ఆంజనేయులు, తెలంగాణ ఉద్యమ కళాకారుడు గాజుల రమేష్, తెలంగాణ ఉద్యమ కళాకారుడు దుబాసి శ్రీనివాస్, పులిపాక బానిష్, నిట్టూరు సరూప, బట్టల గీత, పెండెం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాల్సిందే ఢిల్లీ జాతీయ అఖిలపక్ష ఓబీసీ సమావేశానికి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన బీసీ శ్రేణులు

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ కులగణనకు ప్రత్యేక కాలమ్‌ను తప్పనిసరిగా చేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బీసీ శ్రేణులు ఢిల్లీకి బయలుదేరారు. అక్టోబర్ 8న ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించనున్న జాతీయ అఖిలపక్ష ఓబీసీ సమావేశంలో పాల్గొనేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో వారు బయలుదేరారు. ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ.. గతంలో కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చి, ప్రస్తుతం ఆ హామీని విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన రాజకీయ పార్టీలు ప్రేక్షక పాత్ర వహించడం సరికాదన్నారు. దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో కచ్చితంగా తెలితేనే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు హక్కులు, వాటా దక్కే అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని డిమాండ్ చేశారు. ఓబీసీ కులగణన సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, యువజన సంఘం అధ్యక్షుడు కనకాల శ్యామ్ కూర్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు మణి మంజరి, బండిగారి రాజు, గౌతమి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.జి.ఎఫ్. రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ టౌన్, అక్టోబర్7: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని క్రీడల్లోని విషయాలను విశ్లేషించి పట్టు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని అదే విధంగా లిఈ క్రీడను రాయల్ గేమ్గా పరిగణించడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రీడను ఆడడం ద్వారా శారీరకంగా ధృడపడుతారని ప్రత్యేకంగా ఆలోచన విధానం సైతం మారుతుందని వారు అభిప్రాయపడ్డారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇప్పిస్తూ వివిధ టోర్నమెంట్లకు ఎంపిక చేస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్లోని ఒక ప్రైవేట్ అకాడమీలో నిర్వహించినటువంటి ఎస్ జి ఎఫ్ జోనల్ స్థాయి అండర్ 14 బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్షిప్లో పాఠశాలకు చెందినటువంటి కళ్యాణం సహర్ష్ సాయి, 8వ తరగతి హమ్సికామణి, 8వ తరగతి, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడమే కాకుండా త్వరలో నిర్వహించబోయే ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 బాల బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలకు సైతం అర్హత సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, న్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొమ్మిది దాటిన తెరుచుకోని పాఠశాల గేటు మండుతున్నా ఎండలోనే గేటు ముందు విద్యార్థులు

మహేశ్వరం అక్టోబరు07, : అసలే ఎండలు విపరీతంగా మండుతుండడంతో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు విపరీతంగా వస్తున్నాయి. విద్యార్థులు స్కూలుకు వచ్చి గేటు బయట బ్యాగులు పెట్టి ఎండలో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడుతుండడంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే మహేశ్వరం మండల పరిధిలోని ఎన్డీ తండా ప్రాథమిక పాఠశాల సిబ్బంది ఉదయం తొమ్మిది గంటలైనా పాఠశాల గేటుకు తాళం తీయకపోవడంతో విద్యార్థులు గేటు బయట ఎండలో తిరుగుతున్న దృశ్యం (ది క్రైమ్ న్యూస్) కెమెరాకు చిక్కింది. విద్యార్థులను ప్రశ్నించగా ఉపాధ్యాయులు ఎవరు ఇంకా రాలేదని సమాధానం ఇచ్చారు. ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి మండల విద్యాధికారిని వివరణ కోరగా సమయపాలన పాటించేలా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటానని మండల విద్యాధికారి కాస్నా నాయక్ తెలిపారు. అలాగే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సమయ పాలన పాటించి విద్యార్థులు సమయానికి పాఠశాల లోపలికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రభుత్వ పాఠశాల కు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాధికారిని కోరుతున్నారు.

పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

పెద్దమ్మ తండా గ్రామ సర్పంచ్ నేనావత్ రావి నాయక్

మహేశ్వరం అక్టోబరు 07 : ప్రజల సహకారంతో పార్టీలకతీతంగా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పెద్దమ్మతండ గ్రామ సర్పంచ్ నేనావత్ రవి నాయక్ పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరం మండల పరిధిలోని పెద్దమ్మ తండా గ్రామంలో నూతనంగా సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు గ్రామాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణ నాయక్ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు**

కామారెడ్డి ప్రతినిధి : కామారెడ్డి పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పత్తి కొనుగోళ్లపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించి, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత, రకాన్ని బట్టి ధరలో మార్పులు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు పత్తిని ఇంటి వద్దనే బాగా ఆరబెట్టి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-5779ను సంప్రదించి సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. అలాగే వాట్సాప్ చాట్‌బాట్ నంబర్ 88972-81111 ద్వారా సీసీఐ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సేవలు, సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. గత సంవత్సరం మాదిరిగానే కపాస్ కిసాన్ యాప్ ద్వారా జిల్లాలోని మద్నూర్‌లో ఉన్న 7 జిన్నింగ్ మిల్లులు, గాంధారిలోని 1 జిన్నింగ్ మిల్లులో పత్తిని విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని 67 రైతు వేదికల్లో 67 తేమ కొలిచే పరికరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకురావడానికి ముందే రైతు వేదికల వద్ద తేమ శాతాన్ని పరీక్షించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ అధికారి విజయభారతి, అటవీ శాఖ అధికారులు సంధాన, విజయ్, మద్నూర్, గాంధారి మార్కెట్ కమిటీ కార్యదర్శులు, డీఎస్పీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు, ఎఫ్‌పీవోల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **పెద్దపల్లిలో ఘనంగా సేవా సంకల్ప జ్యోతి యాత్ర..**

పెద్దపల్లి ప్రతినిధి : ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ, సుపరిపాలన ప్రస్థానాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా పెద్దపల్లి పట్టణంలో 'సేవా జ్యోతి యాత్ర--భారీ బైక్ ర్యాలీ'ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్'పై చేసిన ప్రసంగాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. అనంతరం సేవా సంకల్ప్ అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు. సిరి ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా పెద్దపల్లి బస్టాండ్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు బైక్‌లపై పాల్గొని జాతీయ జెండాలు, పార్టీ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా మూగ జయశ్రీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రజల సంక్షేమం, సుపరిపాలన, దేశ అభివృద్ధి కోసం ప్రధాని చేస్తున్న కృషిని ప్రజలకు వివరించడమే సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే 'వికసిత్ భారత్' లక్ష్యమని, ఈ మహా సంకల్పంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, యాత్రలు ప్రజల్లో దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందిస్తున్నాయని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇవ్వడం, ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ నేతలు పేర్కొన్నారు. రక్షణ రంగం నుంచి నిత్యావసర వస్తువుల వరకు దేశీయ తయారీని పెంచడంతో పాటు, వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లేందుకే సేవా సంకల్ప జ్యోతి యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దొంగ ఓట్లకు చెక్ పెట్టేందుకే సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ చేపట్టామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. నిజమైన ఓటర్లకు ఎలాంటి నష్టం జరగదని, సర్‌పై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం చేపడుతున్న ఈ ప్రక్రియపై ప్రజలు అపోహలకు గురికావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి నాగపూర్ రాజమౌళి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుగ్యాల ప్రదీప్ కుమార్, గొట్టిముక్కల సురేష్ రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఖరీఫ్--2026 ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాగులు, సామగ్రి అందుబాటులో ఉండాలి
- ఖరీఫ్--2026 ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ బి శ్రీరాములు

పెద్దపల్లి ప్రతినిధి : ఖరీఫ్--2026 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి శ్రీరాములు అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుఖరీఫ్--2026 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, ధాన్యం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రణాళికను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మండలాల వారీగా పంట కోతల షెడ్యూల్‌కు అనుగుణంగా అవసరమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే సమయానికి రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా రైతులకు ముందుగానే సూచనలు అందించాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీ బ్యాగుల లభ్యతపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఏ కొనుగోలు కేంద్రంలోనూ అవసరమైన సామగ్రి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలు, పరికరాల వినియోగం తదితర అంశాలపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ఎస్‌డబ్ల్యూసీ రీజినల్ మేనేజర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం వీడాలి

మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాల్సిందే..లేదంటే చర్యలు తప్పవు!

మధిర ప్రతినిధి, : మధిర మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు. బుధవారం మధిర పట్టణంలోని 20వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ బొల్లెద్దు విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ పాల్, వివిధ శాఖల అధికారులతో కలిసి చైర్ పర్సన్ పర్యటించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని, అధికారులే స్వయంగా వార్డుల వారీగా పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. వార్డులో తాగునీటి సమస్య, డ్రైనేజీ పూడికతీత, వీధి దీపాలు ఇలా ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని హెచ్చరించారు. అండర్ డ్రైనేజీ కోసం తవ్విన సీసీ రోడ్ల స్థానంలో నూతన రోడ్ల నిర్మాణానికి సంబంధించి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి, ఆ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ కామారెడ్డిలో కాంగ్రెస్ ఆందోళన

అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం: ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో భారీ ధర్నా

కామారెడ్డి ప్రతినిధి : ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాటు పలువురు ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనకు నిరసనగా కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. ఏలే మల్లికార్జున్. ఆధ్వర్యంలో, జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా. దిష్టిబొమ్మను దగ్ధం చేసి, అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య హక్కులు, ఓటు హక్కు మరియు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన పోలీసుల చర్యను వారు ఖండించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న నిరసనల్లో భాగంగా కామారెడ్డి జిల్లాలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ ఆందోళనలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, పి ఎ సి ఎస్ చైర్మన్లు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉన్నత విద్య.. 10 మందికి పీజీ పట్టాలు

మేడ్చల్, అక్టోబర్ 7 : జైలులో ఉన్న సమయంలో విద్యను కొనసాగించిన తెలంగాణకు చెందిన 10 మంది ఖైదీలు పీజీ పట్టాలు అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై పట్టాలను ప్రదానం చేశారు. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ మాజీ డైరెక్టర్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ స్నాతకోత్సవ అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ శాఖకు చెందిన 10 మంది ఖైదీలు ఈ స్నాతకోత్సవంలో పీజీ పట్టాలు అందుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. వీరిలో ఎనిమిది మంది ఎంఎస్సీ సైకాలజీ, మరో ఇద్దరు ఎంఏ సోషియాలజీ కోర్సులను విజయవంతంగా పూర్తి చేశారు. వీరిలో కొందరికి ఇప్పటికే ఎల్ఎల్‌బీ, బీటెక్‌తో పాటు ఇతర ఉన్నత విద్యార్హతలు ఉన్నాయి. జైలులో ఉన్న సమయంలోనే తమ విద్యను కొనసాగించి పీజీ పట్టాలు సాధించారు. తెలంగాణ ప్రిజన్స్ శాఖ డీఐజీ డాక్టర్ డి. శ్రీనివాస్, చెర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ జి. ప్రమోద్ స్నాతకోత్సవానికి హాజరై పీజీ పట్టాలు అందుకున్న ఖైదీలను అభినందించారు. ఖైదీలలో పరివర్తన, పునరావాసం, విడుదల అనంతరం సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు విద్యను కీలక సాధనంగా మార్చేందుకు జైళ్ల శాఖ చేస్తున్న కృషికి ఈ విజయం నిదర్శనంగా నిలిచింది. జైలు జీవితాన్ని సద్వినియోగం చేసుకుని విద్య, జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకుంటే విడుదల అనంతరం కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.ం

పీఎం శ్రీ పాఠశాలల్లో ప్రత్యేక విద్యా బోధకుల నియామకం

మేడ్చల్, అక్టోబర్ 07: జిల్లాలోని 22 పీఎం శ్రీ సెకండరీ పాఠశాలల్లో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్లను నియమించేందుకు సమగ్ర శిక్ష, తెలంగాణ చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాలకు ఒకరి చొప్పున పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఐదు నెలల పాటు నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు నియామకం చేపట్టనున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక విద్యా మద్దతు అందించడంతో పాటు పాఠశాలల్లో సమ్మిళిత విద్యను బలోపేతం చేయడం ఈ నియామకాల ప్రధాన ఉద్దేశం. మేడ్చల్, దుండిగల్ గండిమైసమ్మ, బాచుపల్లి, ఉప్పల్, కాప్రా, షామీర్‌పేట్, కీసర, ఘట్కేసర్, మూడుచింతలపల్లి తదితర మండలాల్లోని పీఎం శ్రీ పాఠశాలల్లో ఈ పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ, జనరల్ బీఈడీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా, పీజీపీడీ, పీజీపీసీ, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో పీజీ డిప్లొమా, ఎస్ఎల్‌టీసీ ఇన్ విజువల్ ఇంపెయిర్‌మెంట్, సీనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ ది డెఫ్, బీఈడీ ఇన్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ వంటి అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనుండగా స్థానిక గ్రామం, మండలం, జిల్లా వారీగా అర్హులైన అభ్యర్థులకు, సంబంధిత రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎంపికైన వారు తమకు కేటాయించిన పాఠశాలతో పాటు సంబంధిత భావితా కేంద్రంలో సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రతి గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్‌కు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లిస్తారు. మండల విద్యాశాఖాధికారి ధ్రువీకరించిన హాజరు ధ్రువపత్రం ఆధారంగా గౌరవ వేతనం విడుదల చేస్తారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం, వారి అవసరాలను అంచనా వేయడం, వ్యక్తిగత విద్యా ప్రణాళికలు రూపొందించడం, వ్యక్తిగత విద్యా మద్దతు అందించడం ఎడ్యుకేటర్ల ప్రధాన బాధ్యతలు. పిల్లల పాఠశాల ప్రవేశం, విద్య కొనసాగింపునకు సహకరించడంతో పాటు పాఠశాలలు, ఇళ్లను సందర్శించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు, కౌన్సెలింగ్ అందించాల్సి ఉంటుంది. భావితా కేంద్రాలు, సమ్మిళిత విద్యా వనరుల వ్యక్తులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యా అర్హత ధ్రువపత్రాల కాపీలు, ఇతర ఆధారాలతో కూడిన దరఖాస్తులను సంబంధిత పీఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 13వ తేదీలోగా సమర్పించాలి. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక, స్వల్పకాలిక ప్రాతిపదికన మాత్రమే ఉంటాయని అధికారులు తెలిపారు. నిర్ణీత కాలం ముగిసిన వెంటనే నియామకం స్వయంచాలకంగా ముగుస్తుందని, భవిష్యత్తులో ఎలాంటి శాశ్వత నియామకంపై హక్కు లేదా క్లెయిమ్ ఉండదని స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్, అక్టోబర్ 07: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నాచారం పోలీసులు సూచించారు. హబ్సిగూడలోని ఒమేగా డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల తీరుతెన్నులు, మోసగాళ్లు అనుసరిస్తున్న విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చేసే మోసాలు, ఇతర ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను తెరవడం, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులకు తెలియజేయడం చేయరాదని సూచించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రజలను మభ్యపెట్టి నగదు బదిలీ చేయించుకుంటున్నారని, అలాంటి మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే స్పందించి 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాచారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ సీఐ కె. ధనుంజయ, సీఐ దుర్గారావు, ఎస్ఐ కె. విజయ పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై పలు సూచనలు చేశారు.

మల్కాజిగిరి కోర్టుకు 40 బెంచీలు

మేడ్చల్, అక్టోబర్ 7 కుషాయిగూడలోని మల్కాజిగిరి కోర్టుకు చెర్లపల్లి ఇండస్ట్రియల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (సీఐఎఫ్ఏ) రూ.2 లక్షల విలువైన 40 బెంచీలను బుధవారం అందజేసింది. కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారులు, సందర్శకుల సౌకర్యార్థం వీటిని ఏర్పాటు చేశారు. కోర్టు పరిపాలనా అధికారి అలీ అస్గర్, నజీర్ భాస్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రత్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, కోశాధికారి పుణ్యరాజు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. సీఐఎఫ్ఏ తరఫున జక్కా రోషి రెడ్డి, కె.వెంకట రత్నం, పి.భీముడు, కిషోర్ కుమార్, కిషోర్, ఎం.వి.ఎస్.మూర్తి, కె.గోపాలకృష్ణ, హరిహర సుబ్రహ్మణ్యం, రాము, శివాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో బెంచీల ఏర్పాటుతో ప్రజలకు, న్యాయవాదులకు కూర్చునే సౌకర్యం మెరుగుపడుతుందని బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సామాజిక సేవలో భాగంగా ప్రజలకు అవసరమైన చోట సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని సీఐఎఫ్ఏ సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లో ఆర్వో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో విద్య, వైద్యం, తాగునీరు, పేద విద్యార్థులకు సహాయం తదితర ప్రజోపయోగ కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.

జలమండలి అధికారులతో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్ష

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జలమండలి అధికారులను ఆదేశించారు. బుధవారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి ఈడీ సంతోష్ రెడ్డి, జీఎంలు కృష్ణ, హరిశంకర్, తాజా మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, జలమండలి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ సమస్యలపై అధికారులతో గాంధీ చర్చించారు. ప్రజల నుంచి అందుతున్న వినతులు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి పైపులైన్లలో కలుషితం చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర, సంతులిత అభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గాంధీ తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో యూజీడీ, తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. అత్యవసర పనులను గుర్తించి ప్రథమ ప్రాధాన్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మురుగునీరు పొంగిపొర్లే సమస్యకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టాలని గాంధీ అన్నారు. డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడా మురుగునీరు రోడ్లపైకి వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు. అవసరమైన చోట పాత పైపులను మార్చడంతో పాటు కొత్త పైపులైన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఇప్పటికే కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించిన గాంధీ.. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ పనులు, కొత్తగా చేపట్టాల్సిన యూజీడీ, తాగునీటి పైపులైన్ పనులను గుర్తించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. విధుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎంలు నారాయణ, శ్రీనివాస్ రాజు, నరేందర్, శ్రీహరి, మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై పోరాటంలో మనోధైర్యమే కీలకం: డాక్టర్ రామకృష్ణ ప్రసాద్

మేడ్చల్, అక్టోబర్ 07: క్యాన్సర్‌ను జయించడంలో ఆధునిక వైద్య చికిత్సతో పాటు రోగిలో ఉండే మనోధైర్యం కూడా అత్యంత కీలకమని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందిస్తే వ్యాధిని పూర్తిస్థాయిలో నియంత్రించి నయం చేసే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో అత్యాధునిక 'హైపర్‌సైట్' సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ వెల్లడించారు. భారతదేశంలోనే తొలిసారిగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, ప్రస్తుతం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్‌లో ఈ సదుపాయం ఉందని తెలిపారు. క్యాన్సర్ కణితి ఉన్న ప్రాంతాన్ని అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించి, అవసరమైన ప్రాంతానికే రేడియేషన్ చికిత్స అందించేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని వివరించారు. దీంతో చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలం, అవయవాలపై రేడియేషన్ ప్రభావాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. క్యాన్సర్ చికిత్సలో ఖచ్చితత్వం పెరగడంతోపాటు రోగులకు చికిత్స సమయంలో ఎదురయ్యే దుష్ప్రభావాలను తగ్గించడంలో ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ సూచించారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తిస్తే చికిత్సకు స్పందించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. ఇప్పటికే ఈ అధునాతన సాంకేతికత ద్వారా పలువురు క్యాన్సర్ రోగులకు చికిత్స అందించామని, వారు కోలుకుంటున్నారని వివరించారు. క్యాన్సర్ నిర్ధారణ అయినప్పుడు రోగులు భయాందోళనలకు గురికాకుండా వైద్యుల సూచనలను పాటిస్తూ ధైర్యంగా చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు. కుటుంబ సభ్యులు కూడా రోగులకు మానసికంగా అండగా నిలవాలని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం, సరైన వైద్య చికిత్స పొందడం, మనోధైర్యంతో చికిత్సను కొనసాగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

కాలనీల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అధికారులను కోరారు. బుధవారం మయూరి నగర్ కాలనీలోని రాక్ గార్డెన్‌లో నిర్వహించిన 'వన్ డే వన్ వార్డ్' రివ్యూ కార్యక్రమంలో డీసీ బాలకృష్ణ, సిఎంసీ వివిధ విభాగాల అధికారులు, కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమన్వయంతో పనిచేస్తే ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, వర్షపు నీటి పారుదల, పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, ఇతర మౌలిక వసతులపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలని కోరారు. డివిజన్‌లో పెరుగుతున్న జనాభా, కొత్తగా అభివృద్ధి చెందుతున్న కాలనీలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి ప్రాథమిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని శ్రీకాంత్ సూచించారు. కాలనీవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో మయూరి నగర్ డివిజన్ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటామని శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంసీ వివిధ విభాగాల అధికారులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి

-నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి -ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు

రామగిరి, అక్టోబర్ 07:- నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు.వారు బుధవారం సింగరేణి రామగుండం-త్రీ ఏరియా లోనీ ఓసిపి-వన్ , ఓసిపి-టూ ఉపరితల గనులను సందర్శించి, నడుస్తున్న పనులను పరిశీలించారు.వారికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావులు స్వాగతం పలికారు. అనంతరం రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో పాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక, రవాణా, జిడికె-10 గని పనుల పురోగతి, మొదలగు అంశాలపై చర్చించారు.తదుపరి ఓసిపి-వన్ , ఓసిపి-టూ ఉపరితల గనులను సందర్శించారు. జీడీకే -10 వ గని వద్ద నడుస్తున్న విస్తరణ పనులను, యంత్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన ఓ.బి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను, ప్రణాళికను రూపొందించుకోవాలని, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, జె. రాజశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జ్ఞాన సంబంధం, ప్రకాష్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, అఫ్సర్ పాషా, కె.ఐలయ్య, మేనేజర్లు రావుల పాపయ్య, భరత్ కుమార్, లతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లు, విద్యార్థులకు న్యాయ అవగాహన

మేడ్చల్, అక్టోబర్ 7: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బొడ్డుప్పల్ మల్లికార్జున్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సీనియర్ సిటిజన్లకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల హక్కులు, వారికి చట్టపరంగా లభించే రక్షణ, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సేవలు, సహాయంపై అవగాహన కల్పించారు. వృద్ధులు తమ హక్కులకు సంబంధించి ఎదుర్కొనే సమస్యలపై న్యాయ సహాయం పొందేందుకు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు సుజాత నాయుడు, వేణుగోపాల్, మల్లికార్జున్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా చెంగిచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ చట్టాలపై వివరించారు. పిల్లలు చెడు వ్యసనాలు, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా తమను ప్రలోభాలకు గురిచేసినా, అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు భయపడకుండా సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించి సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్లు సుజాత నాయుడు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచి, డిజిటల్ సేవలను సురక్షితంగా వినియోగించేలా ప్రోత్సహించేందుకు సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సైబర్ జాగ్రూకత దివస్ పోస్టర్‌ను విడుదల చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్, సైబర్ క్రైమ్స్ డీసీపీ కె. పుష్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా సైబర్ వారియర్స్, వాలంటీర్లు పాల్గొని సైబర్ మోసాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. సైబర్ క్రైమ్స్ డీసీపీ కె. పుష్ప మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ మోసాలు, యూపీఐ మోసాలు, సెక్స్‌టార్షన్, ఆర్థిక, పెట్టుబడి మోసాలపై అవగాహన కల్పించారు. మోసగాళ్లు భయం, అత్యాశ, అత్యవసర పరిస్థితులను సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు పోలీసు లేదా ప్రభుత్వ అధికారులుగా నటించడం, తప్పుడు కేసుల పేరుతో బెదిరించడం, నకిలీ క్యూఆర్ కోడ్లు, చెల్లింపు అభ్యర్థనలు పంపడం, తప్పుడు పెట్టుబడి అవకాశాలతో భారీ లాభాల ఆశ చూపడం వంటి పద్ధతులను ఉపయోగిస్తున్నారని వివరించారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకుండా, ఎలాంటి లావాదేవీ చేసే ముందు సమాచారాన్ని పూర్తిగా ధృవీకరించాలని సూచించారు. అవసరం లేని మొబైల్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారికి సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సైబర్ వారియర్స్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎస్‌సీఎస్‌సీ డైరెక్టర్ రష్మి శ్రీవాస్తవ, అసోసియేట్ డైరెక్టర్ వై. భాను మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ముగింపులో సైబర్ జాగ్రూకత దివస్ పోస్టర్‌ను కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ విడుదల చేశారు. "పాజ్.. థింక్.. వెరిఫై" (ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి) అనే సందేశంతో ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గద్దె శ్రీనివాస్‌కు ఘన సన్మానం

పెద్దపల్లి ప్రతినిధి : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న అంతర్గాం మండలం పొట్యాల ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గద్దె శ్రీనివాస్‌ను పెద్దపల్లి జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లా విద్యాధికారి శారద శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో శారద మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గద్దె శ్రీనివాస్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఆయన అందిస్తున్న సేవలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా మరింత కృషి చేసి విద్యాభివృద్ధిలో పెద్దపల్లి జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం అంతర్గాం మండల విద్యాధికారి కొక్కెర సంగీత, రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేశం, పాలకుర్తి మండల విద్యాధికారి విమల, సెక్టోరియల్ అధికారి మల్లేశం గౌడ్, జీఈసీఓ కవిత, సైన్స్ అధికారి హనుమంతు, రామ్‌రెడ్డితో పాటు జిల్లా విద్యాధికారి కార్యాలయ సిబ్బంది గద్దె శ్రీనివాస్‌ను అభినందించారు. తనను సన్మానించి అభినందించిన డీఈవో, ఎంఈవోలు, ఇతర అధికారులు, సిబ్బందికి గద్దె శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారికి స్వీట్లు తినిపించి తన ఆనందాన్ని పంచుకున్నారు.

సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయాలి

మధిర ప్రతినిధి, : అక్టోబర్7: రెండు వేల ఇరవై ఐదు వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులకు మరియు రెండు వేల ఇరవై ఆరు వేసవిలో జనాభా లెక్కల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘం మధిర మండల శాఖ మధిర మండల విద్యాధికారి శ్రీహరికి వినతి పత్రం అందజేసింది. రెండు వేల ఇరవై ఐదు మే నెల ఇరవై నుండి ఇరవై నాలుగవ తేదీ వరకు ఐదు రోజుల పాటు మధిరలో జరిగిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు హాజరైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అలాగే జనాభా లెక్కల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ అధ్యక్షులు ఆర్. బ్రహ్మారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణ రెడ్డి, పోలే సుధాకర్ మాట్లాడుతూ సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీనివాసరావు, రవి, జమీర్, మల్లెల శ్రీనివాస్, చేడే సతీష్, రాములు, బి.వి.బి.ఎన్. శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నిరుద్యోగ కళాకారుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి

మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి : తెలంగాణ ఉద్యమంలో తమ ఆట, పాటలతో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు 'తెలంగాణ సాంస్కృతిక సారథి'లో 1000 ఉద్యోగాలు ప్రకటిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పెట్టిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ చేపట్టిన "రిలే నిరాహార దీక్ష"కు డాక్టర్ దాసరి మమతా రెడ్డి గారు పూర్తి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మమతా రెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిరుద్యోగ కళాకారులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, ప్రజలను చైతన్యపరిచారని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు.కళాకారులు న్యాయమైన డిమాండ్ల కోసం నిరాహార దీక్షలు చేయాల్సి రావడం విచారకరమని ప్రభుత్వం వెంటనే స్పందించి, వారి డిమాండ్లను పరిష్కరించకపోతే బిఆర్ఎస్ పార్టీ తరఫున కళాకారుల పోరాటానికి అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, కాశీపక వాసు, పల్లె మధు, జక్కుల శ్రీకాంత్, స్వామి వివేక్ పటేల్, ఉద్యమకారులు తదితరు ఉన్నారు.

ఆల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

సంప్రదాయ దుస్తుల్లో అలరించిన విద్యార్థినులు.. రావణ దహనం చేసిన నరేందర్ రెడ్డి



మంచిర్యాల, అక్టోబర్ 07 : ఆల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మలను చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, పాటలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, పండుగల పట్ల అవగాహనతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు పాఠశాలలోసాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా రావణ దహనం కార్యక్రమాన్ని నరేందర్ రెడ్డి నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణ దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలతో పాటు రావణ దహనం కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థుల్లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

పత్రికల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

● సమాచార శాఖ కమిషనర్‌కు టీఎంఎస్‌పీజేఏ విజ్ఞప్తి ● సానుకూలంగా స్పందించిన కమిషనర్

హుజురాబాద్ అక్టోబర్ 7 : ప్రభుత్వ శాఖల నుంచి పత్రికలకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి పత్రికలను ఆదుకోవాలని తెలంగాణ మీడియం, స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌పీజేఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డిని కలిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపూరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పెండింగ్ బకాయిలకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి పరిశీలనలో ఉన్నాయని, బకాయిలు త్వరలోనే చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బాపూరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా చిన్న, మధ్యతరహా దినపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలు క్రమం తప్పకుండా ప్రచురితమవుతున్నాయని తెలిపారు. ఈ రంగంపై ఆధారపడి సుమారు ఐదువేల మంది పాత్రికేయులు పనిచేస్తున్నారని చెప్పారు. చిన్న పత్రికల మనుగడ, జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, మధ్యతరహా పత్రికల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రకటనల్లో చిన్న, మధ్యతరహా పత్రికలకు 30 శాతం వాటా కేటాయింపును అమలు చేయాలన్నారు. ప్రకటనల బిల్లుల సమర్పణకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసి, బిల్లుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలన్నారు. పత్రికల ప్రచురణ క్రమబద్ధత పరిశీలనకు ఆన్‌లైన్ విధానం అమలు చేయాలన్నారు. పత్రికల ఎంపానల్‌మెంట్ ప్రక్రియను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించి, పక్ష పత్రికలకు కూడా అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రముఖుల పర్యటనల వార్తా కవరేజీలో చిన్న, మధ్యతరహా పత్రికలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. పత్రికల్లో పనిచేస్తున్న పాత్రికేయులందరికీ ప్రమాద బీమా కల్పించాలని కోరారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా పాత్రికేయులకు శిక్షణ, పునశ్చరణ కోర్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ పాలక మండలిలో టీఎంఎస్‌పీజేఏకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. చిన్న, మధ్యతరహా పత్రికలు, వాటిలో పనిచేస్తున్న పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని బాపూరావు కోరారు. సమస్యలపై అధికారులతో తక్షణ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్ కంతేటి రమాదేవి, మిట్టపల్లి సురేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

హద్దు రాయి తొలగించి దౌర్జన్యం.. రిజిస్టర్డ్ స్థలంలోకి చొరబడి అక్రమ నిర్మాణం!

● మూడు హద్దు రాళ్లు ఉన్నా.. ఒకటి తొలగించి స్థలంలోకి చొరబాటు ● ఇందిరమ్మ ఇంటి పేరుతో నిర్మాణం.. ప్రశ్నించిన మహిళకు ప్రాణహాని బెదిరింపులు

● ఐదు నెలలుగా నిర్మాణం సాగుతున్నా అధికారులకు కనిపించలేదా? ● ఆర్డీవో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.. బాధితులపైనే పోలీసులకు ఫిర్యాదు

హుజూరాబాద్ అక్టోబర్ 7 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడ్డం పెట్టుకుని ప్రైవేట్ స్థలంలో అక్రమ నిర్మాణానికి పాల్పడుతున్నారంటూ బాధితులు చేస్తున్న ఆరోపణలు హుజూరాబాద్ పట్టణంలో కలకలం రేపుతున్నాయి. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండి, స్థలానికి మూడు వైపులా స్పష్టమైన హద్దు రాళ్లు ఉన్నప్పటికీ.. అందులో ఒక హద్దు రాయిని తొలగించి తమ స్థలంలోకి చొరబడి నిర్మాణం చేపడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అసలేం జరిగింది? బాధితుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని సర్వే నంబర్ 1988/ఎ/సీ/ఎ లో ఉన్న 242 గజాల స్థలాన్ని బోరగాల సులోచన వద్ద నుంచి సబ్బని వరలక్ష్మి సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేశారు. సదరు స్థలానికి మూడు వైపులా హద్దు రాళ్లు ఉన్నాయని బాధితులు తెలిపారు. గత జూన్ 25న వార్డు ఆఫీసర్ ఆధ్వర్యంలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకానికి సంబంధించి జియో ట్యాగింగ్, మార్కింగ్ కోసం సిబ్బంది అక్కడికి వచ్చినట్లు వారు పేర్కొన్నారు. హద్దు రాయిని తొలగించి, పక్కనున్న రిజిస్టర్డ్ స్థలంలోకి చొరబడి పిల్లర్లు వేస్తూ గోడ నిర్మాణం చేపడుతున్నారని బాధితులు ఆరోపించారు. ప్రశ్నించిన దంపతులకు బెదిరింపులా? తమ స్థలంలోకి చొరబడి నిర్మాణం చేపడుతున్న విషయాన్ని సబ్బని వరలక్ష్మి, ఆమె భర్త వెంకటస్వామి ప్రశ్నించగా.. తమను దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. మహిళ అని కూడా చూడకుండా ప్రాణహాని బెదిరింపులు చేశారని, దీంతో తమకు భయాందోళనలు కలుగుతున్నాయని వారు వాపోయారు. ఐదు నెలలుగా నిర్మాణం సాగుతున్నా అధికారులకు కనిపించలేదా? గత ఐదు నెలలుగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి ఎందుకు రాలేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలతో సహా మున్సిపల్ కార్యాలయంలో, ఆర్డీవో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో నిర్మాణాన్ని అడ్డుకునే చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసిన తర్వాత కూడా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణంపై అధికారులు తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. బాధితులపైనే పోలీసులకు ఫిర్యాదు తమపై అక్రమంగా చొరబడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులే.. తిరిగి బాధితులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. తమపై తప్పుడు ఫిర్యాదులు చేసి అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ తమ స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, హద్దు రాళ్లు, ఇతర ఆధారాలను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని బాధిత కుటుంబం జిల్లా ఉన్నతాధికారులను కోరుతోంది. హద్దు రాయి తొలగింపు, స్థలంలోకి చొరబాటు, నిర్మాణం, బెదిరింపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకం పేరుతో నిజంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలోనే నిర్మాణం జరుగుతోందా? లేక ప్రైవేట్ స్థలంలోకి చొరబడి నిర్మాణం చేపడుతున్నారా? అనే అంశంపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి స్థలాన్ని పరిశీలించి, రికార్డులు-- హద్దులను ధ్రువీకరించి, తప్పు ఎవరిదో తేల్చి న్యాయం చేయాలని బాధితులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

శేరిలింగంపల్లిలో ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్

● వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్రకు భారీ స్పందన

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శేరిలింగంపల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్స్‌లో 'వికసిత్ భారత్ సంకల్ప సభ'ను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రిస్టల్ గార్డెన్స్ నుంచి చందానగర్ స్వాగత్ హోటల్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు భారీగా 'సేవా జ్యోతి యాత్ర' ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, జిల్లా ఇన్‌చార్జి ఆలె భాస్కర్ హాజరయ్యారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, 2014 తర్వాత దేశ ప్రధానమంత్రిగా నేటి వరకు సుమారు 25 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ ప్రజాసేవలో కొనసాగుతున్నారని అన్నారు. ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 2014కు ముందు దేశ పరిస్థితులు, ప్రస్తుతం భారత్ సాధించిన పురోగతిని ప్రజలు పరిశీలించాలని సూచించారు. మౌలిక వసతులు, తయారీ రంగం, డిజిటల్ సాంకేతికత, విద్య, వైద్యం తదితర రంగాల్లో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరువయ్యాయని పేర్కొన్నారు. జన్‌ధన్ ఖాతాల ద్వారా పేదలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఉజ్వల యోజన ద్వారా వంటగ్యాస్ కనెక్షన్లు అందించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య భరోసా లభిస్తోందని అన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారని రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ బాల్దా అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజిత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, సింధు రెడ్డి, బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు అర్జున్, మల్లేష్, వెంకటేష్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల పదాధికారులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రామగిరి శ్రీ భద్రకాళీ ఆలయంలో అక్టోబర్ 11 నుండి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సముద్రాల విజయసారథి

రామగిరి, అక్టోబర్ 07:- రామగిరి మండలం సెంటినరీ కాలనీ సమీపంలోని సింగరేణి ఆర్జీ-త్రీ, ఓసీ-వన్, ఫేస్-టూ ఆవరణలో గల తెలంగాణలోనే రెండవ భద్రకాళీ ఆలయమైన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు అక్టోబర్ 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు మొత్తం 11 రోజుల పాటు ఈ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి డాక్టర్ సముద్రాల విజయసారథి పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ 11రోజుల ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి వివిధ రూపాలలో విశేష అలంకరణలు, వైభవంగా అభిషేకాలు, కుంకుమార్చనలు, నిత్య పూజలు నిర్వహించనున్నారు. వీటితో పాటు ఆలయ ఆవరణలో చండీ హోమం, లలితా సహస్రనామ పారాయణలు శాస్త్రోక్తంగా జరుగుతాయని, అలాగే ఆలయ ప్రాంగణంలోని నాగదేవత మంటపాల వద్ద కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ప్రధాన అర్చకులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకుల సహకారంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ శరన్నవరాత్రి వేడుకలకు విచ్చేసే భక్తులందరికీ నిత్యం ప్రసాద వితరణ కార్యక్రమం కూడా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కావున పరిసర ప్రాంతాల నుండే కాక రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని శ్రీ భద్రకాళీ అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సముద్రాల విజయసారథి భక్తులకు పిలుపునిచ్చారు.

నాలుగవ ప్యానెల్ లాంగ్ వాల్ పనులను పూర్తి చేయాలి

-వెన్సర్ కంపెనీ పనుల పురోగతి పై చర్చ -అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించిన డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)



రామగిరి, అక్టోబర్ 07:- నిర్దేశించిన సమయంలో నాలుగు వ ప్యానెల్ లాంగ్ వాల్ పనులను పూర్తి చేయలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. వారు బుధవారం అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించారు.అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు నిర్దేశించిన సమయంలో లాంగ్ వాల్ పనులను పూర్తి చేయడానికి తీసుకొంటున్న చర్యలను వివరించారు. అనంతరం డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ మాట్లాడుతూ లాంగ్వాల్ మూడు వ ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పూర్తి చేసినందుకు గాను అందులో భాగస్వాములు అయిన వారికి అభినందనలు తెలిపారు. నాలుగు వ ప్యానెల్ తయారీ పనుల పై చర్చించి, భద్రత పై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. భద్రత తో నిర్దేశించిన సమయంలో నాలుగు వ ప్యానెల్ పనులను పూర్తిచేసి, లాంగ్ వాల్ నుండి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.అలాగే వెన్సర్ కంపెనీ పనుల పురోగతి పై చర్చించారు.వారితో పాటు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, కార్పొరేట్ భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె.యాదయ్య, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ఏరియా ప్రాజెక్ట్ ఇంజినీర్ దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ బాలరాజు, మేనేజర్ పెంచలయ్య, వెన్సర్ కంపెనీ అధికారులు రాజన్న, చక్రవర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ ల మహిమ తప్పతాగి సోయి లేకుండా...

మహేశ్వరం అక్టోబరు 07, , :గ్రామాలలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా ఏర్పడడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతూ అనారోగ్యం పాలవుతున్నారు. బుధవారం మహేశ్వరం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ఓ రైతు అతిగా మద్యం తాగి సోయి లేకుండా రహదారికి అడ్డంగా పడుకున్న దృశ్యం "ది క్రైమ్ న్యూస్" కెమెరాకు చిక్కింది దీంతో తుమ్మలూరు నుంచి కుమ్మరిగడ్డ వెళ్లే రహదారిలో వాహనాదారులు వెళ్లాలంటే ఇబ్బందికరంగా తయారయింది. గ్రామాలలో బెల్ట్ షాపులను తొలగించేలా గ్రామ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అలాగే మహేశ్వరం ఎక్సైజ్ అధికారుల సహకారంతో బెల్ట్ షాపుల తనిఖీలు నిర్వహించి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని తుమ్మలూరు గ్రామ ప్రజలు గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని కోరుతున్నారు.

ఆరోగ్య కేంద్రంలో మాజీ కార్పొరేటర్ పర్యటన

మేడ్చల్, అక్టోబర్ 07: కుషాయిగూడలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో కొనసాగుతున్న వైద్య సేవలు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సదుపాయాలను పరిశీలించారు. ముఖ్యంగా అసాంక్రమిక వ్యాధుల గుర్తింపు, సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ కోసం నిర్వహిస్తున్న పరీక్షల శిబిరాన్ని పరిశీలించి, శిబిరానికి హాజరవుతున్న ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చిన్నారులకు నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని కూడా పరిశీలించారు. టీకాలు తీసుకునేందుకు వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలకు నిర్ణీత వయసులో అన్ని టీకాలు వేయించడం ద్వారా పలు వ్యాధుల నుంచి రక్షణ కల్పించవచ్చని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, రోజువారీగా వచ్చే రోగుల వివరాలు, నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలపై సిబ్బందితో ఆమె చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆరోగ్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని శ్రీదేవి యాదవ్ సూచించారు. ప్రజలు అనారోగ్య సమస్యలు వచ్చిన తర్వాత మాత్రమే వైద్యులను సంప్రదించకుండా ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం తదితర అసాంక్రమిక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సీఈఐఆర్ సాయంతో 50 సెల్‌ఫోన్లు రికవరీ

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : మాధాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోయిన, చోరీకి గురైన సుమారు 50 సెల్‌ఫోన్లను పోలీసులు సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ సాయంతో గుర్తించి రికవరీ చేశారు. ఆయా ఫోన్ల ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వివిధ ప్రాంతాల్లో వాటిని గుర్తించిన పోలీసులు, నిరంతరంగా ఫాలోఅప్ చేసి స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్ల మొత్తం విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అవసరమైన ధ్రువీకరణ, చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం బుధవారం మాధాపూర్ పోలీస్ స్టేషన్‌లో కూకట్‌పల్లి జోన్ డీసీపీ సమక్షంలో సెల్‌ఫోన్లను వాటి అసలైన యజమానులకు అప్పగించారు. పోగొట్టుకున్న తమ ఫోన్లు తిరిగి లభించడంతో యజమానులు సంతోషం వ్యక్తం చేస్తూ మాధాపూర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేసిన మాధాపూర్ పోలీసు సిబ్బందిని కూకట్‌పల్లి జోన్ డీసీపీ అభినందించారు. మొబైల్ ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా ప్రజలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి ఐఎంఈఐ నంబర్‌తో పాటు ఇతర వివరాలను అందించాలని మాధాపూర్ పోలీసులు సూచించారు. ఈ వివరాల ఆధారంగా సీఈఐఆర్ వ్యవస్థ ద్వారా ఫోన్లను త్వరగా గుర్తించి తిరిగి అప్పగించే అవకాశం ఉంటుందని తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

మేడ్చల్, అక్టోబర్ 7: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కీసర మండలం బండ్లగూడలోని రామలింగేశ్వర కాలనీకి చెందిన పి.విజయేందర్ కుమారుడు పి.మురళి కార్తీక్ (23) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనం (టీజీ08జే7351)పై చక్రిపురం నుంచి ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్ వైపు బయలుదేరాడు. కుషాయిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుటకు చేరుకున్న సమయంలో బైక్ అదుపుతప్పి స్కిడ్ కావడంతో మురళి కార్తీక్ రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో మురళి కార్తీక్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి తండ్రి పి.విజయేందర్ కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

స్పోర్ట్స్

18 స్థానాలు ఎగబాకిన శ్రేయస్ అయ్యర్

కెరీర్ బెస్ట్ 7వ ర్యాంక్ సాధించిన అయ్యర్

ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు. నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరఫున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు.ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్థాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు.

చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకుంటుంది

అగార్కర్‌కు గంభీర్ ఎమోషనల్ మెసేజ్

టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఘనంగా వీడ్కోలు పలికాడు. అగార్కర్ హయాంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు గెలవడాన్ని గుర్తు చేసుకున్న గంభీర్.. భవిష్యత్తులో చరిత్ర అతడిని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుందని పేర్కొన్నాడు. "అజిత్ భాయ్.. మీతో కలిసి పనిచేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ హయాంలో సాధించిన మూడు ఐసీసీ ట్రోఫీలే మీ నమ్మకానికి నిదర్శనం. ఎప్పుడూ జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారు. చరిత్ర మిమ్మల్ని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుంది. ధన్యవాదాలు. మీ భవిష్యత్తుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని గంభీర్ 'ఎక్స్'లో పోస్టు చేశాడు. 2023 జులైలో అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో భారత్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్ సాధించింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న పరిమిత ఓవర్ల సిరీస్‌కు జట్లను ఎంపిక చేయడం అగార్కర్ చేపట్టిన చివరి బాధ్యతగా నిలిచింది. అగార్కర్ పదవీకాలం మంగళవారంతో అధికారికంగా ముగిసింది. ఖాళీ అయిన సెలెక్టర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రస్తుతం మాజీ భారత స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20లు, భారత్-ఏ జట్టుకు సంబంధించిన మూడు మ్యాచ్‌ల కోసం జట్ల ఎంపికలో అతడు పాల్గొన్నాడు. సెలెక్షన్ ప్యానెల్‌లో ఓజాతో పాటు శివసుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ ఉన్నారు. కొత్త సెలెక్టర్ కోసం అక్టోబర్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థి కనీసం ఏడు టెస్టులు లేదా 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. మరో నిబంధన ప్రకారం ఐదు సంవత్సరాల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఉండాలి.

అగార్కర్ వల్లే భువీ కంబ్యాక్ ఆగిపోయిందా?

టీమిండియా స్వింగ్ సుల్తాన్ భువనేశ్వర్ కుమార్ దాదాపు నాలుగేళ్ల తర్వాత మళ్లీ భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో భువికి చోటు దక్కడం అభిమానులకు ఊరటనిచ్చింది. అయితే ఇన్నాళ్లూ ఆయనను జట్టులోకి తీసుకోకపోవడానికి మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కరే ప్రధాన కారణమంటూ ఒక దిగ్భ్రాంతికర కథనం వెలుగులోకి వచ్చింది. అగార్కర్ పదవీ కాలం ముగియడం, ప్రజ్ఞాన్ ఓజా నేతృత్వంలోని తాత్కాలిక సెలెక్షన్ కమిటీ రావడం వెనువెంటనే జరగడంతో భువి కమ్‌బ్యాక్ సాధ్యమైంది.గత కొంతకాలంగా ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ భువనేశ్వర్ కుమార్‌ను అగార్కర్ సెలెక్షన్ కమిటీ వరుసగా పక్కన పెడుతూ వచ్చింది. భవిష్యత్తు అవసరాల కోసం కేవలం యంగ్ ఫాస్ట్ బౌలర్లను మాత్రమే ప్రోత్సహించాలని అగార్కర్ గట్టిగా భావించడమే దీనికి కారణమని తెలుస్తోంది. కమిటీలోని మాజీ పేసర్ ఆర్పీ సింగ్ పలుమార్లు భువీ పేరును ప్రతిపాదించినా, అగార్కర్ మద్దతు లభించకపోవడంతో ఆయన రీఎంట్రీ ఆలస్యమైందని ఆ నివేదిక పేర్కొంది. అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా తప్పుకున్న తర్వాత బీసీసీఐ ప్రజ్ఞాన్ ఓజాను తాత్కాలిక సెలెక్షన్ కమిటీ హెడ్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఓజా, భువనేశ్వర్ అనుభవంపై పూర్తి నమ్మకం ఉంచి న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేశారు. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేని లోటును భర్తీ చేసేందుకు, అనుభవజ్ఞుడైన భువీ ఉండటం జట్టుకు ఎంతో ప్రయోజనకరమని సెలెక్టర్లు భావించారు. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్‌లో ఆర్‌సిబి వరుసగా రెండు టైటిళ్లు గెలవడంలో కీలక పాత్ర పోషించారు. భువి రీఎంట్రీ కేవలం పాత పేరు చూసి ఇచ్చినది కాదు. ఐపీఎల్ 2025లో ఆర్‌సిబి తరఫున 14 మ్యాచుల్లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 16 మ్యాచుల్లో ఏకంగా 28 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో సత్తా చాటారు. భారత్ తరఫున ఇప్పటివరకు 87 ౨20 మ్యాచ్‌ల్లో 90 వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్, కొత్త బంతితో స్వింగ్ చేసే నైపుణ్యంతో మళ్లీ టీమిండియాలో మెరవడానికి సిద్ధమయ్యారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో యంగ్ టీమ్‌తో కలిసి ఆయన న్యూజిలాండ్ సిరీస్‌లో ఆడనున్నారు. న్యూజిలాండ్ సిరీస్ కోసం శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. జట్టులో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, శివం దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ స్థానం సంపాదించారు. ఈ యంగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ కాంబినేషన్ సిరీస్‌లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా స్మృతి మంధాన

భారత మహిళ క్రికెట్? జట్టు కెప్టెన్?గా సీనియర్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితులయ్యారు. భారత మహిళా క్రికెట్ జట్టు సారథ్యం నుంచి హర్మన్ ప్రీత్ కౌర్ వైదొలిగిన నేపథ్యంలో ఆమె స్థానంలో స్మృతి మంధానను కెప్టెన్‌గా నియమిస్తూ బీసీసీఐ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా స్మృతి మంధానకు బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా శుభాకాంక్షలు తెలిపారు. భారత మహిళ క్రికెట్ జట్టులో అత్యంత అనుభవజ్ఞులైన క్రీడాకారిణుల్లో ఒకరైన మంధాన, 2013 నుంచి జాతీయ జట్టులో సభ్యురాలిగా కొనసాగుతూ ఈ బాధ్యతను చేపట్టారు. ఆమె గతంలో 18టీ20, లు, నాలుగు వన్డేలలో భారత జట్టుకు నాయకత్వం వహించారు. భారత జట్టుకు నాయకత్వం వహించే బాధ్యత తనకు అప్పగించడంపై స్మృతి మంధాన స్పందించారు. ఇది తనకు దక్కిన ప్రత్యేకమైన గౌరవంగా ఆమె పేర్కొన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశం ఎంతో విలువైందిగా భావిస్తానని, అలాగే, తనకు మద్దతుగా నిలిచి నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచర క్రికెటర్లకు స్మృతి కృతజ్ఞతలు తెలిపారు. భారత మహిళా క్రికెట్? జట్టును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో గత కొన్నేళ్లుగా సారథ్యం వహించిన హర్మన్ ప్రీత్ సేవలను స్మృతి అభినందించారు. గొప్ప నిబద్ధతతో జట్టును ముందుకు నడిపించడంలో హర్మన్? కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ నెలలో జింబాబ్వేతో స్వదేశంలో జరిగే టీ20, వన్డే సిరీస్‌లకు స్మృతి మంధానను సారథిగా వ్యవహరించనున్నారు. టీ20ల్లో షెఫాలి వర్మ, వన్డేల్లో దీప్తి శర్మ వైస్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. అయితే, రెండు జట్లలోనూ హర్మన్‌ప్రీత్‌కు చోటు దక్కింది. రాయ్‌పూర్ వేదికగా ఈ నెల 16, 18, 20 తేదీల్లో టీ20 సిరీస్ జరుగనుంది. 23, 25, 28 తేదీల్లో వడోదర వన్డే సిరీస్‌కు ఆతిథ్యమివ్వనుంది. టీ20 జట్టులో ప్రతీకా రావల్‌కు చోటు దక్కలేదు. కానీ నికీ ప్రసాద్, మిన్ను మణి, అనుష్క శర్మ జింతిమని కలితాలను జట్టులోకి తీసుకున్నారు. వీరంతా ఆస్ట్రేలియా మహిళల జట్టుతో ఇటీవల జరిగిన సిరీస్‌లలో ఆడారు. ఇక, స్మృతి మంధాన విషయానికొస్తే, 29 ఏళ్ల మంధాన దేశవాళీ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో నాయకురాలిగా గణనీయమైన విజయాన్ని సాధించారు. ముఖ్యంగా 2024, 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్?సీబీ) జట్టును 'ఉమెన్స్ ప్రీమియర్ లీగ్' (డబ్ల్యూపీఎల్?) టైటిల్స్ వైపు నడిపించడం ఇందులో చెప్పుకోదగ్గ విషయం. ఈ విజయాలే ఆమెకు భారత జట్టు పూర్తిస్థాయి నాయకత్వ బాధ్యతలు దక్కేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయని చెప్పవచ్చు. మరోవైపు, స్మృతి మంధాన నియామకంపై మిథున్ మన్హాస్ అభినందనలు తెలిపారు. స్మృతిపై పూర్తి నమ్మకం ఉందని, ఆటపై ఆమెకు ఉన్న అనుభవం ఈ కొత్త బాధ్యతలో జట్టుకు ఎంతో మేలు చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్మృతి సమర్థవంతంగా కెప్టెన్సీ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. స్మృతి సాధించిన విజయాని ఆయన ప్రస్తావించారు. "భారత జట్టుకు నాయకత్వం వహించడం ఒక కీలకమైన బాధ్యత, కానీ ఆ బాధ్యతను స్వీకరించే అనుభవం, స్వభావం స్మృతికి ఉన్నాయి. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా ఆమె సాధించిన విజయం ఆమె నాయకత్వ లక్షణాలకు మరో నిదర్శనం" అని సైకియా తెలిపారు.

భారత క్రికెట్‌కు 'రో-కో' ఒక వరం

పాకిస్థాన్ మాజీ పేసర్ సోహైల్ తన్వీర్

టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం భారత క్రికెట్‌కు దొరికిన ఒక వరం అని పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ సోహైల్ తన్వీర్ ప్రశంసించాడు. వారిద్దరి అపార అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని, రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని వారి సేవలు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డాడు. ఇటీవల ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ సోహైల్ తన్వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "విరాట్ కోహ్లి గణాంకాలే అతని సత్తా ఏంటో చెబుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు అతను ఎన్నో మధురమైన జ్ఞాపకాలను అందించాడు. కోహ్లి వీలైనంత ఎక్కువ కాలం ఆడటం భారత క్రికెట్‌కు నిజంగా ఒక వరం" అని ఆయన అన్నాడు. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు కూడా వర్తింపజేస్తూ, వయసును ప్రతికూలంగా చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. 2024 జూన్ లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కోహ్లి, రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు, 2025 మేలో టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇద్దరూ కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో తన్వీర్ మాట్లాడుతూ.. "సీనియర్ ఆటగాళ్లకు తమ ఆటను ఎలా నిర్వహించుకోవాలో బాగా తెలుసు. అదే సమయంలో వారు యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయగలరు. రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్, లయను కాపాడుకోగలిగితే, అతను, కోహ్లి ఇద్దరూ జట్టులో కొనసాగడం శుభపరిణామం" అని వివరించాడు. 39 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవలి కాలంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో 92, 101 పరుగులు సాధించాడు. అతను 2027 ప్రపంచకప్‌లో ఆడతాడా? లేదా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ, ఫామ్, ఫిట్‌నెస్ ఉన్నంతవరకు వయసుతో సంబంధం లేదని తన్వీర్ నొక్కిచెప్పాడు. అనుభవజ్ఞులైన ఈ ఇద్దరు ఆటగాళ్ల మార్గదర్శకత్వంలో యువ జట్టు రాటుదేలుతుందని అభిప్రాయపడ్డాడు.

విశ్వజ

వర్షాకాలంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు, వీటితో కూడా బెనిఫిట్స్!

వర్షాకాలంలో సీజనల్ డిసీజెస్ దాడి చేస్తాయి. వర్షాకాలంలో కాలానుగుణంగా వచ్చే రోగాల నుండి కాపాడుకోవడానికి రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడం చాలా అవసరం. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మన ఇమ్యూనిటీని ఏ విధంగా పెంచుకోవాలి? ఈ సీజన్లో ఇమ్యూనిటీని బూస్ట్ చేసే ఆహారాలు ఏమిటి? అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. వర్షాకాలంలో ఇమ్యూనిటీ కోసం ఆహారాలు వర్షాకాలం తరచుగా అనేక ఆరోగ్య సమస్యలను తీసుకువస్తుంది. ఆరోగ్యంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాల పైన దృష్టి సారించడం చాలా అవసరం. విటమిన్లు మరియు ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న సమతుల్య ఆహారం శరీరాన్ని అనేక రోగాల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. ఈ సమయంలో మీ రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడానికి కొన్ని చిట్కాలు ఇక్కడ ఉన్నాయి. వర్షాకాలంలో విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. విటమిన్ %జ% దాని రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. నారింజలు, బత్తాయి మరియు నిమ్మ వంటి సిట్రస్ పండ్లు విటమిన్ సి పుష్కలంగా ఉండే పండ్లు. ఇవి మీ రోజువారీ ఆహారంలో చేర్చడం సాధారణ జలుబు మరియు ఫ్లూ నుండి మీ శరీరాన్ని కాపాడుతుంది. ఆకుకూరలు, కూరగాయలను ఎంచుకోండి.. పాలకూర, బచ్చలి కూర మరియు పచ్చి అరటికాయలు వంటి ఆకు కూరగాయలు ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి విటమిన్లు %ూ, జ%, మరియు %ఖ% ను అందిస్తాయి. ఇవి బలమైన రోగనిరోధక వ్యవస్థను నిర్వహించడానికి కీలకంగా పనిచేస్తాయి. మనం తీసుకునే ఆహారంలో ఈ కూరగాయలను చేర్చడం మన ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది. తగినంత నీరు త్రాగండి.. సరైన హైడ్రేషన్ మంచి ఆరోగ్యాన్ని నిర్వహించడానికి కీలకం. తగినంత నీరు త్రాగడం శరీరం నుండి విషాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. తగినంత నీటితో పాటు, హర్బల్ టీలు మరియు సూప్‌లు వర్షాకాలంలో కూడా ప్రయోజనకరంగా ఉంటాయి, వేడి మరియు హైడ్రేషన్‌ను అందిస్తాయి. అల్లం మరియు వెల్లుల్లిని చేర్చండి.. అల్లం మరియు వెల్లుల్లి సహజ యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. వీటిని సులభంగా ఆహారంలో చేర్చుకుంటే మంచిది. అల్లం వెల్లుల్లి రుచిని మాత్రమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడతాయి. ప్రొబయోటిక్స్‌ను తీసుకోండి... ప్రొబయోటిక్స్ గట్ ఆరోగ్యంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ఇది రోగనిరోధక శక్తి పెంచడానికి దోహదం చేస్తుంది. పెరుగు ప్రొబయోటిక్స్ యొక్క గొప్ప వనరు. దీన్ని మీ ఆహారంలో చేర్చడం జీర్ణశక్తికి మరియు రోగనిరోధక శక్తి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జంక్ ఫుడ్‌ను నివారించండి... ప్రాసెస్ చేసిన ఆహారాలు కాలక్రమేణా రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తాయి. వర్షాకాలంలో జంక్ ఫుడ్ తీసుకోవడం పరిమితం చేయడం మంచిది. బదులుగా, అవసరమైన పోషకాలను అందించే సంపూర్ణ ఆహారంపై దృష్టి పెట్టండి.



ప్రతీరోజూ 7గంటల కంటే తక్కువ సమయం నిద్రపోవటం వలన ఏం జరుగుతుంది?

నిద్ర... మానవ జీవితంలో అతి ముఖ్యమైన భాగం. ప్రతిరోజు ఎనిమిది గంటలు నిద్ర లేకపోతే మనిషి ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతిరోజు అవసరమైనంత నిద్రపోయిన వారు ఆరోగ్యంగా ఉంటారు. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చాలామంది అర్ధరాత్రి వరకు మెలకువగా ఉండి ఎప్పుడో పడుకుంటారు. వారు కనీసం 7గంటల పాటు కూడా నిద్రపోరు. అయితే దాని ప్రభావం వారి శరీరం పైన పడుతుందనే విషయాన్ని వారు గమనించరు. కానీ ఇది నిజం. 7 గంటల కంటే తక్కువ నిద్రపోతే జరిగేదిదే ప్రతిరోజు ఏడు గంటల కంటే తక్కువ నిద్రపోయిన వారిలో రకరకాల సమస్యలు వస్తాయి. శారీరక, మానసిక సమస్యలతో వారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో కూడా సమయం దొరకడం లేదు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఒక వ్యక్తి 7 గంటల కంటే తక్కువ నిద్రపోతే అతనికి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల తేదీలు దానం, కడియంకు బిగ్ షాక్ ఇచ్చిన రేవంత్ రెడ్డి తక్కువ సమయం నిద్రపోతే ఆరోగ్యానికి హాని ఏడు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోతే అది మీ ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం 7 గంటల సమయం కంటే తక్కువ నిద్రపోయే వ్యక్తి వేగంగా బరువు పెరుగుతారు. నిద్ర చక్రంలో ఆటంకాలు ఏర్పడతాయి. ఇవి మానసిక రుగ్మతలకు కూడా కారణమవుతాయి. ఏడు గంటల కంటే తక్కువ నిద్రపోవడం వల్ల వారిలో ఒత్తిడి, టెన్షన్ పెరుగుతుంది. డిప్రెషన్ వంటి సమస్యలను ఎదుర్కొంటారు. సరిపోను నిద్రపోతే శరీరం రిపేర్ 7 గంటలకంటే తక్కువ నిద్రపోయే వ్యక్తులు ఉదయం తాజా అనుభూతిని చెందరు. శరీరంలో అలసట అలాగే ఉంటుంది. రాత్రి సమయంలో నిద్ర పోయినప్పుడు మన శరీరంలో ఉన్న చిన్న చిన్న సమస్యలు రిపేర్ చేయబడతాయి. సరిగ్గా నిద్రపోని వారిలో శరీరం రిపేర్ కాదు. ఫలితంగా అనారోగ్యం వస్తుంది. శరీరం నుంచి టాక్సిన్స్ బయటకు పోవు. నిద్రలేమితో వచ్చే రోగాలివే శరీరంలో విషపదార్థాలు చేరడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతోపాటు రక్తపోటు కూడా పెరుగుతుంది. ఫలితంగా ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు ఉరుకుల పరుగుల జీవితంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఈరోజు ఏడు నుంచి ఎనిమిది గంటలసేపు కచ్చితంగా నిద్ర పోవాలి.

‘సామాన్య శాస్త్రానికి’ తను ఒక మారుపేరు!

సైన్స్‌ను సామాన్యుల దగ్గరికి తీసుకుపోవడానికి ‘బెంగళూరు సైన్స్ గ్యాలరీ’ ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి ఫాల్కి. ‘సైంటిఫిక్ స్టోరీ టెల్లర్’గా దేశవిదేశాల్లో పేరు తెచ్చుకున్న జాహ్నవి సైన్స్‌కు సంబంధించిన డాక్యుమెంటరీలు తీసింది. పుస్తకాలు రాసింది. ‘అడగడం’ ‘తెలుసుకోవడం’ అనే ప్రక్రియ జాహ్నవికి ఎంతో ఇష్టమైనది. ఆమెకు బాగా నచ్చే మాట.. రైట్ క్వశ్చన్. రిసెర్చ్ వర్క్ నుంచి కెరీర్‌కు సంబంధించి డైరెక్షన్‌ను మార్చుకోవడం వరకు ‘రైట్ క్వశ్చన్’ అనేది ఆమెకు ఎంతో ఉపయోగపడింది. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరకు తీసుకెళ్లింది. అక్కడ భారతదేశ శాస్త్ర సాంకేతిక చరిత్రను అధ్యయనం చేసింది. ఆ చరిత్రపై బాగా ఇష్టాన్ని పెంచుకుంది. తాను తెలుసుకున్న విషయాలను, తన అభిప్రాయాలను నలుగురితో పంచుకోవడానికి వివిధ మాధ్యమాలను ఎంచుకుంది. ‘బాంబే యూనివర్శిటీ’లో సివిక్స్ అండ్ పాలిటిక్స్ చదువుకున్న జాహ్నవి ‘జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ’లో సైన్స్ అండ్ టెక్నాలజీ హిస్టరీలో డాక్టరేట్ చేసింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం ద్వారా సామాజిక కోణంలో సైన్స్‌ను అర్థం చేసుకుంది. ఆమె మాటల్లోనే చెప్పాలంటే ‘సైన్స్ అనేది ఒంటరి కాదు’ సైన్స్‌ను ప్రభావితం చేసే అంశాలు సమాజంలో ఎన్నో ఉంటాయి. ఆ అంశాలకు సైన్స్‌కు మధ్య ఉండే అంతః సంబంధాన్ని లోతుగా అధ్యయనం చేసింది. ‘ఆటోమిక్ స్టేట్ బిగ్ సైన్స్ ఇన్ ట్వంటీయత్ సెంచరీ ఇండియా సైన్స్’ పుస్తకం జాహ్నవికి ఎంతో పేరు తెచ్చింది. ‘కీ కాన్సెప్ట్స్ ఇన్ మోడ్రన్ ఇండియన్ స్టడీస్’కు కో%--%ఎడిటర్‌గా వ్యవహరించింది. ‘సైక్లోట్రాన్’ పేరుతో సైన్స్ డాక్యుమెంటరీ తీసింది. సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ద్వారా కథలు చెప్పడం తనకు ఇష్టమైన పని. ‘మెనూ గురించి తెలుసుకోవాలంటే మనం మొదట ఉండాల్సింది టేబుల్ దగ్గర’ అంటున్న జాహ్నవి ‘సైన్స్’ అనే మెనూ గురించి తెలుసుకోవడానికి ‘సైన్స్ గ్యాలరీ’ అనే టేబుల్ దగ్గరికి ప్రజలను తీసుకువస్తుంది. లండన్‌లోని కింగ్స్ కాలేజీ ఫ్యాకల్టీగా పనిచేసిన జాహ్నవి 2018లో ‘బెంగళూరు సైన్స్ గ్యాలరీ’ ఫౌండింగ్ మెంబర్‌గా నియమితురాలైంది. ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచానికి కాస్త దూరంగా.. సృజనాత్మకంగా ఆలోచించేలా, ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. ‘మ్యూజియం’ వాతావరణం ఆమెకు కొత్త కాదు. ‘సైన్స్ మ్యూజియం లండన్’ ఎక్స్‌టర్నల్ క్యురేటర్‌గా పనిచేసి ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. ‘మా టార్గెట్ ఆడియెన్స్ పదిహేనేళ్ల పైబడిన వారు అయినప్పటికీ అండర్ గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లపై కూడా దృష్టి సారిస్తాం. అంతరిక్షానికి సంబంధించి సమకాలీన, భవిష్యత్ విషయాలపై దృష్టి పెట్టేలా గ్యాలరీ తోడ్పడుతుంది’ అంటుంది జాహ్నవి. శాస్త్రీయ విషయాలతో యువత మమేకం కావడానికి డిజిటల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. ‘బ్రేకింగ్ ది వాల్స్ బిట్వీన్ సైన్స్ అండ్ కల్చర్’ శీర్షికతో నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ గ్యాలరీకి కూడా మంచి స్పందన వచ్చింది. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ జాహ్నవిని హ్యూమానిటీస్ విభాగంలో ‘ఇన్ఫోసిస్ ప్రైజ్’తో సత్కరించింది. సైన్స్‌ను జాహ్నవి అర్థం చేసుకున్న కోణాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ప్రశంసించింది.

రోగనిరోధక శక్తి మరియు జీర్ణక్రియ కోసం లవంగం నీటి ఆరోగ్య ప్రయోజనాలను అన్వేషించండి

ప్రతీ ఇంటా లవంగాలు తప్పని సరిగా ఉంటాయి. వంట ఇంటి మసాలా దినుసుల్లో వినియోగించే ఈ లవంగాలు ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. ఆయుర్వేద ప్రకారం లవంగాలు అద్భుతమైన ఔషధం. లవంగాలు నేరుగా తీసుకోవటం లేదా ఘాటు ఎక్కువగా ఉంటే నీటిలో వేసుకొని తాగటం వలన మంచి ప్రయోజనాలు ఉంటాయి. పలు రోగాలను నయం చేసే గుణం లవంగాలకు ఉంది. ఆరోగ్య పరంగా లవంగాల ద్వారా వచ్చే ప్రయోనాల గురించి ఆయుర్వే వైద్యులు కీలక అంశాలను వెల్లడించారు. నిత్యం లవంగాల నీళ్లను తాగడం వల్ల జీర్ణవ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో ఆహారాన్ని జీర్ణాశయం సులభంగా జీర్ణం చేస్తుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి, వికారం వంటి సమస్యలు తగ్గుతాయి. లవంగాల్లో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం జీర్ణాశయ గోడలను సంర క్షిస్తుంది. దీంతో అల్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. లవంగాలలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల లవంగాల నీళ్లను తాగితే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. లవంగాల్లో యాంటీ సెప్టిక్ గుణాలు సైతం ఉంటాయి. లవంగాలను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. %ూశ్రీంశీ =ఘుౕ% రోజూ చపాతీ తింటే వచ్చే ఆరోగ్య సమస్యలు ఇవే.. జాగ్రత్త మరి..!! లవంగాల నీళ్లను తాగితే శరీరంలోని వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యం గా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అలాగే తలనొప్పి నుంచి బయట పడవచ్చు. అధ్యయనాల ప్రకారం లవంగాల నీళ్లను తాగుతుంటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. లవంగాల్లో నైజెరిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు లవంగాల నీళ్లను తాగుతుంటే ఫలితం ఉంటుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. సీజనల్ గా వచ్చే రోగాల నుంచి బయట పడవచ్చుని సూ చిస్తున్నారు. ఇలా.. లవంగాల నీళ్ల ను తీసుకోవటం ద్వారా అనేక ప్రయోజనాలు సొంతం చేసుకోవచ్చు.

వేగంగా బరువు తగ్గాలంటే ఉదయాన్నే ఈ అలవాట్లను పాటించండి!!

ప్రస్తుతం సమాజంలో చాలామంది ఎదుర్కొంటున్న అతి ప్రధానమైన సమస్య ఊబకాయం. విపరీతంగా బరువు పెరిగి, బరువు తగ్గక ఇబ్బందులు పడుతున్న వారు ఎంతోమంది ఉన్నారు. బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలితం శూన్యంగా మారడంతో చాలామంది నిరుత్సాహానికి గురవుతున్నారు. అయితే బరువు తగ్గాలి అనుకునే వారు రోజువారీ సరైన దినచర్యను పాటించాలని ఫిట్నెస్ నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునే వారు కొన్ని అలవాట్లను తప్పనిసరిగా అలవర్చుకోవాలని, ఉదయాన్నే లేవగానే ఈ అలవాట్లను పాటించటం వల్ల వేగంగా బరువు తగ్గడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. ప్రతిరోజు ఉదయం నిద్ర లేచిన వెంటనే పళ్ళు తోముకోకుండానే ఒక గ్లాసు నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి. పరగడుపున ఒక గ్లాసు నీళ్లు తాగడం వల్ల ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాదు ప్రతిరోజు ఉదయం లేచిన తర్వాత యోగా చేయడం అలవాటు చేసుకోవాలి. యోగా కారణంగా మానసిక ఆరోగ్యం మెరుగు పడడమే కాకుండా, బరువు కూడా బాగా తగ్గుతుంది. ఉదయం నిద్ర లేచిన వెంటనే మార్నింగ్ వాకింగ్ చేయడం అలవాటు చేసుకున్న వారు బరువు బాగా తగ్గడానికి అవకాశం ఉంటుంది. ప్రతిరోజు ఉదయం నడవడం వల్ల శరీరంలో కేలరీలు ఖర్చవుతాయి. దీంతోపాటు సంతోషకర హార్మోన్ల ఉత్పత్తి జరుగుతుంది. ఇది మీ బరువు తగ్గడంతో పాటు, ఆరోగ్యంగా ఉంచేలా చేస్తుంది. ప్రతిరోజు ఉదయం లేచిన తర్వాత వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి. దీంతో ఊబకాయం సమస్య నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంది. అంతేకాదు ఉదయం పూట ఆరోగ్యకరమైన ఆహారాన్ని అల్పాహారంగా తీసుకోవాలి. నూనెలో ముంచి తీసిన పదార్థాలకు స్వస్తి పలకండి. బరువును నియంత్రణలో ఉంచే, పోషకాలు సమృద్ధిగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. మంచి ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం మిమ్మల్ని బరువు తగ్గేలా చేస్తాయి. ఇక ఈ అలవాట్లను మన జీవితంలో ఒక భాగంగా చేసుకుంటే వేగంగా బరువు తగ్గవచ్చు. ఆరోగ్యంగా జీవించవచ్చు.

ఆర్బీఐ నిర్ణయంతో స్టాక్ మార్కెట్ కుదేలు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ఆర్ఎన్ఏ): దేశీయ స్టాక్ మార్కెట్లకు బుధవారం భారీ షాక్ తగిలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.5 శాతానికి చేర్చడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 173.05 పాయింట్లు కోల్పోయి 22,603.05 వద్ద స్థిరపడింది. ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచడంతో పాటు తన ద్రవ్య విధాన వైఖరిని 'క్యాలిబ్రేటెడ్ టైటనింగ్'గా మార్చింది. దీంతో రానున్న రోజుల్లో వడ్డీ రేట్ల పరిస్థితి మరింత కఠినంగా ఉండొచ్చన్న ఆందోళన ఇన్వెస్టర్లలో పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ 22,700 స్థాయిని కోల్పోయి 22,600 కీలక మద్దతు స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 22,600 కంటే దిగువన స్థిరంగా కొనసాగితే 22,400 వరకు పడిపోయే అవకాశం ఉందన్నారు. పైకి వెళ్లాలంటే 22,800 స్థాయి కీలక అడ్డంకిగా ఉంటుందని పేర్కొన్నారు. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, బీఈఎల్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు భారీగా నష్టపోయాయి. ముఖ్యంగా మెటల్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. విస్తృత మార్కెట్‌లోనూ బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.63 శాతం పడిపోయింది. అయితే నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.30 శాతం లాభపడటం కొంత ఊరటనిచ్చింది. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ అత్యధికంగా నష్టపోయింది. మరోవైపు నిఫ్టీ

పీఎస్‌యూ బ్యాంక్ సూచీ లాభాల్లో ముగిసి మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచింది. ఇక రానున్న రోజుల్లో ఆర్బీఐ నిర్ణయాలు ఆర్థిక వృద్ధి, మార్కెట్‌లో నగదు లభ్యత, కంపెనీల ఆదాయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల సీజన్ కూడా మార్కెట్‌కు కీలకం కానుంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలను కంపెనీలు ఎలా ఎదుర్కొంటాయి? ధరలను కొనసాగించగలవా? డిమాండ్‌ను నిలబెట్టుకోగలవా? అన్న అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నారు.

మరోవైపు ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) బజాజ్ ఫైనాన్స్, తన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 7 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త రేట్ల ప్రకారం, వడ్డీని 15 నుంచి 40 బేసిస్ పాయింట్ల వరకు పెంచారు. దీనివల్ల సీనియర్ సిటిజన్లు గరిష్ఠంగా 8.15 శాతం వరకు వడ్డీని పొందనున్నారు. ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడంతో 5.50 శాతానికి చేరిన నేపథ్యంలో, బజాజ్ ఫైనాన్స్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తాజా సవరణల ప్రకారం, సాధారణ డిపాజిటర్లు 31 నుంచి 60 నెలల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై ఇప్పుడు 7.75 శాతం వరకు వార్షిక వడ్డీని పొందవచ్చు. గతంలో ఈ వడ్డీ రేటు 7.40 శాతంగా ఉండేది. అదేవిధంగా, 12-17 నెలల డిపాజిట్లపై వడ్డీని 6.80 శాతానికి, 18-30 నెలల డిపాజిట్లపై 7.00 శాతానికి పెంచారు. సీనియర్ సిటిజన్లకు సాధారణ రేట్ల కంటే అదనంగా 0.40 శాతం అధిక వడ్డీని సంస్థ అందించనుంది. దీంతో 31-60 నెలల కాలపరిమితి గల డిపాజిట్లపై వారికి గరిష్ఠంగా 8.15 శాతం వడ్డీ లభిస్తుంది. ఇక ఇప్పటికే ఉన్న డిపాజిట్లను రెన్యూవల్ చేసుకునే వారికి అదనంగా 0.10 శాతం ప్రయోజనం ఉంటుంది. తద్వారా సీనియర్ సిటిజన్లు రెన్యూవల్‌పై గరిష్ఠంగా 8.25 శాతం వరకు వడ్డీ పొందే అవకాశం ఉంది. ఈ పెంచిన వడ్డీ రేట్లు క్యుములేటివ్, నాన్-క్యుములేటివ్ ఆప్షన్లు రెండింటికీ వర్తిస్తాయి. కనిష్ఠంగా రూ. 15,000 నుంచి గరిష్ఠంగా రూ. 3 కోట్ల వరకు చేసే డిపాజిట్లకు ఈ సవరించిన రేట్లు వర్తిస్తాయని కంపెనీ స్పష్టం చేసింది.

రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్నో సోయికి నోబెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : వైద్యశాస్త్రంలో చేసిన సేవలకుగానూ 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. సైంటిస్టులు కార్ల్ డిస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌లకు అత్యున్నత పురస్కారం నోబెల్ లభించింది. కాంతి-నియంత్రిత అయాన్ ఛానెల్స్, ఆప్టోజెనెటిక్స్ పై వారి ఆవిష్కరణలకు ఈ అవార్డు అందుకుంటున్నారు. సజీవ మెదడులోని నాడుల కణాలు (న్యూరాన్లు) మన జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనను ఎలా ప్రభావితం చేస్తాయో చూపించడం వీరు చేసిన ప్రయోగం ద్వారా సాధ్యమైంది. పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్ ఒక ఏకకణ నాచు (శైవలం)లో ఛానెల్ రోడాప్సిన్ అనే అద్భుతమైన ప్రోటీన్ ఉన్నట్లు కనుగొన్నారు. కార్ల్ డిస్సెరోత్ ఈ ప్రోటీన్‌ను నరాల కణాల కోసం కాంతితో నియంత్రించగలిగే ఒక 'స్విచ్' విధానం తీసుకొచ్చారు. ప్రముఖ శాస్త్రవేత్త జార్జ్ నాగెల్ 1953లో జన్మించారు. ఆయన 1988లో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. జార్జ్ నాగెల్ ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ వుర్జ్‌బర్గ్ (జర్మనీ) మాలిక్యులర్ ప్లాంట్ ఫిజియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని 'మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోఫిజిక్స్'లో చేసి చూపించారు. వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపికైన పీటర్ హెగెమాన్ 1984లో జర్మనీకి చెందిన మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ విభాగం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. జర్మనీలోని హంబోల్ట్ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్‌లో 'హర్టీ సీనియర్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరోసైన్స్'గా పీటర్ హెగెమాన్ చేస్తున్నారు. ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ లో చేసి నిరూపించారు. నోబెల్ బహుమతి విజేతలకు అందించే మొత్తం నగదు బహుమతి 1.2 కోట్ల స్వీడిష్ క్రోనర్ (దాదాపు 11 లక్షల 96 వేల డాలర్లు). ఒకరు విజేతగా నిలిస్తే వారికే మొత్తం నగదు లభిస్తుంది. ముగ్గురు విజేతలు కనుక ఈ మొత్తాన్ని ఆ ఏడాది విజేతలకు సమానంగా పంచుతారు. నోబెల్ అసెంబ్లీ 1977 ఏడాదిలో స్థాపించారు. వైద్య రంగంలో నోబెల్ బహుమతిని అందజేసే కరోలిన్స్కా ఇన్స్టిట్యూట్‌కు ఇది ప్రధాన సంస్థ. స్టాక్‌హోంలోని కరోలిన్స్కా ఇన్స్టిట్యూట్‌లో నోబెల్ బహుమతి ప్రకటన చేస్తారు. ఈ ప్రకటనతో 2026 ఏడాదికిగానూ నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇతర రంగాలలో సైతం నోబెల్ విజేతలను ప్రకటిస్తారు.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి

పూర్వాంచల్, అక్టోబర్ 07 : ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రహదారిపై ఆగి ఉన్న ఒక ట్రక్కును కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారందరినీ టెన్నిస్ క్రీడాకారులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అయోధ్య పరిధిలోని 97.500 మైలురాయి వద్ద బుధవారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నోలో నిర్వహించిన ఒక టెన్నిస్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆరుగురు యువకులు తిరిగి దేవరియాకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం ధాటికి కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. వాహనంలో చిక్కుకున్న వారిని యూపీఈఐడీఏ భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు అతికష్టం మీద వెలికితీశారు. ఈ ఘటనలో దేవరియాకు చెందిన నిత్యా ప్రజాపతి (22), ఇర్ఫాన్ అన్సారీ (20), అనికేత్ (24) మృతి చెందారు. ఆనంద్ యాదవ్ (23), రాజు (22), జయంత్ శర్మ (30) తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అయోధ్యలోని దర్శన్ నగర్ మెడికల్ కాలేజీకి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తామందరం నిద్రలో ఉన్నామని, అసలేం జరిగిందో కూడా తెలియలేదని గాయపడిన జయంత్ పోలీసులకు చెప్పాడు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న ట్రక్కు డ్రైవర్‌ను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

రాజమండ్రి, అక్టోబర్ 07 : వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ తుది దశకు చేరుకున్న సమయంలో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, ముందుగా హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. కేసు విచారణ అత్యంత వేగంగా సాగుతోందని, మొత్తం 87 మంది సాక్షుల్లో అత్యధికుల విచారణ ఇప్పటికే పూర్తయిందని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేయడం సముచితం కాదని ఆయన తన వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విచారణ గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని అనంతబాబు భార్య చేసిన అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఈ సందర్భంగా పిటిషన్‌ను వెనక్కి తీసుకుని హైకోర్టును ఆశ్రయించాలని అనంతబాబు తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. విచారణను రోజువారీ పద్ధతిలో కొనసాగించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో, వీడియో ఫైల్స్, డిజిటల్ ఆధారాలకు సంబంధించిన మరో అనుబంధ పిటిషన్‌ను కూడా పిటిషనర్ తరఫు వారు ఉపసంహరించుకున్నారు. గతంలో బెయిల్‌పై విడుదలైన అనంతబాబుకు... సాక్షులను బెదిరించారన్న ఆరోపణలతో బెయిల్ రద్దు కావడంతో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు.

ఈశాన్య ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్థుల భవనం

ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీసిన ప్రజలు
శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం
శిథిలాల నుంచి నలుగురిని కాపాడిన స్థానికులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఓ ఐదు అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. కళ్లముందే భారీ భవనం నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు, హాహాకారాలు చెలరేగాయి. భారీ ఎత్తున శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 3:15 గంటల సమయంలో భవనం కూలిపోయినట్లు ఫైర్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం చేశాయి. జిల్లా డీసీపీ ఆర్తి బీనా స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం నలుగురిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అయితే భవన యజమానితో పాటు ఒకే కుటుంబానికి చెందిన సుమారు ఆరుగురు వ్యక్తులు ఇంకా శిథిలాల కిందే చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద ఊపిరాడక అల్లాడుతున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రమాదానికి గురైన భవనం కేవలం 25 చదరపు గజాల విస్తీర్ణంలోనే నిర్మించినట్లు ప్రాథమిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకాణాలు ఉండగా, పైన నాలుగు అంతస్తులను నివాసాల కోసం కేటాయించారు. ఈ భవన నిర్మాణం గతేడాదే పూర్తయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంత తక్కువ విస్తీర్ణంలో సరైన పునాదులు, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. భవనం కూలిన ఘటనతో ఆ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అడ్వైజరీ జారీ చేశారు. సీమాపురి రౌండ్‌అబౌట్, డీఎల్ఎఫ్ భోపురా, పరిసర మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. సహాయక చర్యలకు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఘటనా స్థలం వద్ద ప్రజలు గుమిగూడవద్దని, వాహనాలను రోడ్లపై నిలపవద్దని పోలీసులు హెచ్చరించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

భారత్‌లో ఈవీ వాహనాల అమ్మకాల జోరు..

సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో అమ్మకాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : భారత ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. సెప్టెంబర్ నెలలో ఈవీ రిటైల్ విక్రయాలు ఆల్ టైమ్ రికార్డును సృష్టించాయి. ఈ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా 3,33,634 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం గమనార్హం. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఇది 74 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలను ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ సమాఖ్య (ఫాడా) బుధవారం విడుదల చేసింది. ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ స్పందిస్తూ, ఇది కేవలం గతేడాదితో పోల్చిన వృద్ధి మాత్రమే కాదని, ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. పండగ సీజన్ డిమాండ్, పెట్రోల్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉన్న నిర్వహణ ఖర్చులు, మార్కెట్లోకి వస్తున్న కొత్త మోడళ్లు, పీఎం ఈ-డ్రైవ్ వంటి ప్రభుత్వ పథకాల ప్రోత్సాహం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈవీ మార్కెట్ కేవలం సబ్సిడీలపైనే కాకుండా, వినియోగదారుల డిమాండ్ ఆధారంగా పుంజుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా పరిశీలిస్తే, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు 88.67 శాతం వృద్ధితో 2,07,314 యూనిట్లకు చేరాయి. అలాగే, ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల విక్రయాలు 94.56 శాతం పెరిగి 36,108 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ రెండు విభాగాల్లోనూ అమ్మకాలు ఆల్ టైమ్ హై స్థాయికి చేరడం విశేషం. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల విక్రయాలు 86,024 యూనిట్లుగా, కమర్షియల్ వాహనాల అమ్మకాలు 4,188 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ భారీ విక్రయాలతో దేశంలోని మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా గతేడాది ఉన్న 10 శాతం నుంచి ప్రస్తుతం 13 శాతానికి పెరిగింది.

ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్‌లో చైనా గూఢచారులు

మాజీ పరిశోధకుడి సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సంచలన ఆరోపణలు తెరపైకి వచ్చాయి. చైనాకు చెందిన గూఢచారులు ఇప్పటికే అమెరికా ప్రముఖ ఏఐ సంస్థలు ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్‌లోకి చొరబడ్డారని మాజీ పరిశోధకుడు జాకబ్ కాక్సన్ ఆరోపించారు. ఈ విషయం 90 శాతం నిజమని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. అమెరికన్ వ్యాపారవేత్త ప్యాట్రిక్ బెట్-డేవిడ్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో కాక్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై ఎంత నమ్మకం ఉందని అడగ్గా.. "90 శాతం నమ్మకంగా ఉన్నాను" అని స్పష్టం చేశారు. కాక్సన్ గతంలో ఓపెన్‌ఏఐ, ఆ తర్వాత ఆంథ్రోపిక్‌లో పరిశోధకుడిగా పనిచేశారు. ఏఐ అభివృద్ధి అత్యంత వేగంగా సాగడం మానవాళి భవిష్యత్తుకే ముప్పుగా మారొచ్చంటూ ఇటీవల ఆందోళన వ్యక్తం చేసి ఆంథ్రోపిక్‌కు రాజీనామా చేశారు. అమెరికా ఏఐ సంస్థల్లో చైనాకు అనుకూలమైన వ్యక్తులకు అంతర్గత సమాచారం అందుబాటులో ఉంటే.. కీలక మోడళ్లను రహస్యంగా బయటకు తరలించే అవకాశం ఉందని కాక్సన్ హెచ్చరించారు. అమెరికా సాంకేతిక ఆధిక్యాన్ని చైనా ఎప్పుడైనా దెబ్బతీయగలదని పేర్కొన్నారు. అమెరికా ఏఐ రంగంలో విదేశీ గూఢచర్యంపై ఆందోళనలు ఇప్పటికే ఉన్నాయి. చైనా సంస్థలు అమెరికా అభివృద్ధి చేసిన ఏఐ మోడళ్లను 'డిస్టిలేషన్' పద్ధతిలో అనుకరిస్తున్నాయనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఇందులో పెద్ద ఏఐ మోడల్‌ను 'టీచర్'గా ఉపయోగించి చిన్న మోడల్‌కు శిక్షణ ఇస్తారు. అమెరికా రక్షణ సంస్థల్లో విదేశీ ఉద్యోగులపై కఠినమైన భద్రతా తనిఖీలు ఉంటాయని కాక్సన్ చెప్పారు. కానీ సిలికాన్ వ్యాలీలోని ఏఐ సంస్థల్లో ఇలాంటి తనిఖీలు తక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగుల నియామకంలో రక్షణ రంగ స్థాయి భద్రతా నిబంధనలు తీసుకురావాలని సూచించారు. అమెరికా-చైనా మధ్య ఏఐ పోటీ మరింత వేడెక్కుతోంది. సెప్టెంబరులో చైనాకు చెందిన 10 ప్రముఖ ఏఐ సంస్థలు 16 మోడళ్లను విడుదల చేసినట్లు నిక్కీ లెక్కలు చెబుతున్నాయి.

ధామ్ సమీపంలో భారీ ట్రాఫిక్ జామ్!

సుమారు 20 కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్
రోడ్డుపై నిలిచిపోయిన వేలాది వాహనాలు

నైనితాల్, అక్టోబర్ 07 : ఉత్తరాఖండ్ నైనితాల్ జిల్లాలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం కైంచీ ధామ్ వద్ద ఊహించని రీతిలో భారీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. నీమ్ కరోలీ బాబా ఆశ్రమ దర్శనం కోసం, ఇటీవల ప్రచారంలోకి వచ్చిన హనుమాన్ అంశ ప్రభావం వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు ఒకేసారి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భోవాలి-అల్మోడా రహదారిపై ఏకంగా 20 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కైంచీ ధామ్‌కు వెళ్లే ప్రధాన రహదారులన్నీ పర్యాటకుల కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలతో నిండిపోయాయి. గంటల తరబడి వాహనాలు అంగుళం కూడా ముందుకు కదలకుండా నిలిచిపోవడంతో పర్యాటకులు, చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొండ ప్రాంతం కావడంతో ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం, ఇరుకైన రహదారులు ఉండటం వల్ల సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. కైంచీ ధామ్ పీఠాధిపతి నీమ్ కరోలీ బాబాకు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది భక్తులు ఉన్నారు. సెలవు రోజులు లేదా ప్రత్యేక సందర్భాలలో ఇక్కడికి భక్తుల రాక విపరీతంగా పెరుగుతుంది. ఇటీవల సోషల్ మీడియా ప్రచారం, చిత్రాల ప్రభావం, ప్రముఖుల సందర్శనల వార్తల వల్ల యువత, పర్యాటకులు కైంచీ ధామ్ వైపు ఆకర్షితులవుతున్నారు. కొండ ప్రాంతాలలో పెరిగే వాహనాల సంఖ్యకు తగ్గట్లుగా పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడం వల్ల రహదారులపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. ట్రాఫిక్ సమాచారం అందుకున్న వెంటనే నైనితాల్ జిల్లా పోలీసులు, స్థానిక యంత్రాంగం రంగంలోకి దిగాయి. వాహనాలను క్రమబద్ధీకరించడానికి, ప్రత్యామ్నాయ పాయింట్ల వద్ద నిలిపివేయడానికి పోలీసులు గంటల తరబడి శ్రమించారు. రద్దీని నియంత్రించేందుకు కైంచీ ధామ్ మార్గంలో భారీ వాహనాల ప్రవేశంపై తాత్కాలికంగా ఆంక్షలు విధించారు. కొండ ప్రాంతాలలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లే ముందు ప్రయాణికులు ముందస్తుగా ట్రాఫిక్ అప్‌డేట్స్ తెలుసుకోవాలని, యంత్రాంగం జారీ చేసే మార్గదర్శకాలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

కాలిఫోర్నియాలో భారీ ఫ్రాడ్ కేసు కలకలం

నేరం అంగీకరించిన నాటా మాజీ అధ్యక్షుడు

కాలిఫోర్నియా, అక్టోబర్ 07 : అమెరికాలోని నార్తర్న్ కాలిఫోర్నియాలో భారీ ఫ్రాడ్ కేసు కలకలం రేపింది. నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాఘవరెడ్డి గోసల నేరం అంగీకరించారు. చారిటబుల్ మ్యాచింగ్ ప్రోగ్రామ్‌లను మోసగించడం, ట్యాక్స్ రిటర్న్‌లను తప్పుగా చూపించడం లాంటి వ్యవహారాల్లో ఆయన ఫెడరల్ కోర్టులో తప్పు ఒప్పుకున్నారు. వైర్ ఫ్రాడ్, అమెరికా ప్రభుత్వాన్ని మోసగించే కుట్ర చేశారని ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. లాభాపేక్ష లేని సంస్థను అడ్డం పెట్టుకుని ఆయన ఈ మోసానికి పాల్పడ్డారు. నాటా సంస్థ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ యజమానుల నుంచి మిలియన్ల కొద్దీ డాలర్ల ఫ్రాడ్ విరాళాలను ఆయన సేకరించారు. ఈ వ్యవహారానికి సంబంధించి పెన్సిల్వేనియాలోని నార్త్ వేల్స్‌కు చెందిన 65 ఏళ్ల రాఘవరెడ్డి గోసల పై 2026 మే 5న కేసు నమోదు అయింది. ఫెడరల్ కోర్టులో విచారణ జరగ్గా తనపై మోపిన అభియోగాలన్నింటినీ ప్లీ అగ్రిమెంట్ కింద ఆయన అంగీకరించారు. ఈ కేసును అసిస్టెంట్ యూఎస్ అటార్నీ మైఖేల్ జి. పిట్‌మాన్, సాహిబ్ కౌర్ సహాయంతో వాదిస్తున్నారు. ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్, ఎఫ్‌బీఐ దర్యాప్తు సంస్థల విచారణ తర్వాత రాఘవరెడ్డి గోసల వ్యవహారం బయటపడింది. నేరం అంగీకరించడంతో ఈ కేసు తదుపరి విచారణలో కోర్టు ఆయనకు శిక్ష ఖరారు చేయనుంది.

ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ చాన్స్?

అమరావతి, అక్టోబర్ 07 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి పయనమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన హస్తినకు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో భేటీ కానున్నారు. ప్రధానంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం తెలపాలని ఆయన ప్రధానిని కోరనున్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిపే చర్చల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళుతున్న మిగులు జలాల సద్వినియోగం, నదుల అనుసంధానం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం చేయించడం వంటి అంశాలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించే 'భాగస్వామ్య సదస్సు' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం రేపు రాత్రికి ఆయన ఢిల్లీ నుంచి తిరిగి అమరావతికి బయలుదేరనున్నారు.

అందాలు ఆరబోస్తున్న కన్నప్ప హీరోయిన్

టాలీవుడ్‌ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. కొత్త హీరోయిన్స్ చాలా మంది తన అందంతో నటనతో ఆకట్టుకుంటున్నారు. అలా టాలీవుడ్ కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటిస్తుంది. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలతో తన కెరీర్ ను ప్రారంభించింది. అందాల భామ ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆతర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్ గా మారింది.'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. మంచు విష్ణు తెరకెక్కిస్తున్న కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతి ముకుందన్మంచు. కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ చిన్నది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు చుస్తే నోరెళ్లబెట్టాల్సిందే.. ఈ ఫొటోలకు కుర్రాళ్ళు రొమాంటిక్ కామెంట్స్ చేస్తున్నారు.

లుక్స్‌పై కాకుండా.. పనితనంపై దృష్టిపెట్టండి..

మిల్కీబ్యూటీ కామెంట్‌పై తమన్నా రియాక్షన్

తమన్నా తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. ఇటీవల స్పెషల్ సాంగ్స్ లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుందో. రీసెంట్ గా విడుదలైన 'స్త్రీ 2' చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. ఈ అమ్మడు విజయ్ వర్మతో డేటింగ్ చేస్తోంది. అయితే గతంలో తమన్నా తనను మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్ తో పిలవొద్దు అని చెప్పింది. తనకు మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్ ఇవ్వొద్దు అని తెలిపింది. తాజాగా మరోసారి మిల్కీ బ్యూటీ ట్యాగ్ గురించి ప్రస్తావించింది. తమన్నా భాటియాను "మిల్కీ బ్యూటీ" అని పిలవడం గురించి ఆమె ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఓదెల 2' సినిమా ప్రమోషన్ సందర్భంగా తమన్నాను ఓ రిపోర్టర్ ఇలా అడిగారు: "ఒక మిల్కీ బ్యూటీలో శివశక్తి ని చూడాలని ఎలా అనిపించింది.?" దీనికి తమన్నా స్పందిస్తూ, తనను "మిల్కీ బ్యూటీ" అని పిలవడం తనకు సమస్య కాదని, అయితే తన పాత్రల ద్వారా తన సామర్థ్యాన్ని చూపించడంపైనే ఎక్కువ దృష్టి పెడతానని చెప్పింది. ఆమె మాటల్లో, "నన్ను మిల్కీ బ్యూటీ అని పిలవడం గురించి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ నేను ఈ సినిమాలో శివశక్తి పాత్రను పోషిస్తున్నాను, ఇది ఒక ఆధ్యాత్మిక శక్తితో కూడిన పాత్ర. నా పాత్రల ద్వారా నా నటనా సామర్థ్యాన్ని, వైవిధ్యాన్ని చూపించడమే నా లక్ష్యం." అని తెలిపింది. ఆమె తన లుక్స్‌పై కాకుండా తన పనితనంపై దృష్టి పెట్టాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేసింది తమన్నా.

లండన్‌లో జాన్వీ అందాల విందు

ఇండస్ట్రీలో కొత్త అందాలు ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొత్త కొత్త హీరోయిన్ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సినిమా సినిమాకు కొత్త హీరోయిన్స్ పరిచయం అవుతూ దూసుకుపోతున్నారు. ఇక చాలా మంది హీరోయిన్స్ కు అవకాశాలు చాలా చిత్ర విచిత్రంగా వస్తుంటాయి. కొంతమంది ఎంతో కష్టపడి అవకాశాలను అందుకుంటున్నారు. మరికొంతమందికి ఈ మధ్య సోషల్ మీడియా పుణ్యమా అని హీరోయిన్ అవకాశాలు అందుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ అలా వచ్చిన వారే.. అయితే ఇప్పుడు మనం చూస్తున్న హీరోయిన్ కూడా విచిత్రంగా హీరోయిన్ గా మారిపోయింది. హీరోయిన్ పాత్ర కోసం ఆడిషన్ కు వెళ్తే అనుకోకుండా హీరోయిన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ఇప్పటికే చాలా మంది హీరోయిన్ తెలుగులో రాణిస్తున్నారు వారిలో శివాని నాగరం ఒకరు. ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా. శివాని నాగరం నటనా జీవితాన్ని ఆడిషన్‌ల ద్వారా ప్రారంభించింది. ఈ అమ్మడి మొదటి సినిమా అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు (2024), ఈ చిత్రంలో సుహాస్ సరసన హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ఆమె లక్ష్మి అనే పాత్రలో కనిపించింది. ఈ సినిమాలో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇక ఈ చిన్నది సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇన్ స్టాగ్రామ్ ద్వారా మెసేజ్ పంపారు, నేను హీరోయిన్ ఫ్రెండ్ రోల్ కోసం ఆడిషన్ అని వెళ్లాను. అయితే ఆడిషన్ తీసుకున్న తర్వాత హీరోయిన్ గానే తీసుకుంటున్నారు అని చెప్పారు. అయితే మొదటి రోజు షూటింగ్ జరిగే వరకు నేనే హీరోయిన్ అనేది నమ్మలేకపోయా.. అని తెలిపింది. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది.

మంచులక్ష్మి ఎకిపారేస్తున్న నెటిజన్లు

మోహన్ బాబు ముద్దులు కూతరు మంచు లక్ష్మి గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. హోస్ట్‌గా కెరీర్ తొలినాళ్లలో అదరగొట్టిన మంచు లక్ష్మి ఆ తర్వాత నటిగా మారింది. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులని మెప్పిస్తుంది. ఇదే క్రమంలో హనీరోజ్ మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ తో కలిసి ఓ సినిమా చేసింది మంచు లక్ష్మి. ఆ సినిమా పేరు మాన్‌స్టర్. ఈ సినిమా సస్పెన్స్ థ్రిల్లర్ గా తెరకెక్కింది. ఈ సినిమాలో మంచు లక్ష్మి కీలక పాత్ర పోషించింది. అలాగే ఈ సినిమాలో మంచు లక్ష్మి,హనీరోజ్ లెస్బియన్స్ గా నటించారు. అంతే కాదు ఈ సినిమాలో లక్ష్మి మంచు, హనీ రోజ్ డీప్ లిప్ కిస్ కూడా ఉంది. ఈ మూవీ క్లైమాక్స్ సీన్ లో లక్ష్మి మంచు, హనీ రోజ్ లిప్ లాక్ సీన్ ఉండగా, ఇంటిమేట్ సీన్స్ లో ఈ ఇద్దరు రెచ్చిపోయి నటించారు. సినిమా వచ్చి చాలా రోజులే అయినా మరోసారి యూట్యూబ్‌లో ఈ మూవీ సీన్స్ వైరల్ అవుతున్నాయి. ఇక ఇదిలా ఉంటే కరణ్ జోహార్ హోస్ట్ చేస్తూ నిర్మిస్తున్న ఇండియన్ వర్షెన్ ది ట్రైటర్స్ లో మంచు లక్ష్మి కీలక పాత్రలో కనిపిస్తుంది. ఉల్లు ఫ్లాట్ ఫామ్ బోల్డ్ స్టార్స్ కూడా ఇందులో పాల్గొంటున్నారు. అయితే తాజాగా మంచు లక్ష్మి ఎంట్రీకి సంబంధించిన ఎపిసోడ్ స్ట్రీమ్ కాగా, అందులో ఓ కంటెస్టెంట్‌తో మంచు లక్ష్మి గొడవపడింది. రామాయణంలో రాముడు నీటిలో చూస్తూ పైన ఉన్న చేపని విల్లుతో కొట్టాడని వాదనకి దిగింది. దీంతో ఎవరు ఈమె? ఏం మాట్లాడుతుంది అంటూ నార్త్ ఇండియన్స్ మంచు లక్ష్మికి సంబంధించిన క్లిప్పింగ్‌ని సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ చేస్తున్నారు. ఈవిడ మహాభారత కథని రామాయణంగా మార్చిందని ట్రోల్ చేస్తున్నారు. ఈ వీడియోలో మంచు లక్ష్మిని చూసిన తెలుగోళ్లు కూడా తెగ తిట్టేస్తున్నారు. ఆ అవతారం ఏంది? ఆ కథేంది? పరువు తీస్తున్నావు కదా అంటూ తిట్టిపోస్తున్నారు.

డబుల్ డోస్

వెకేషన్‌లో ఫొటోలు షేర్ చేసిన సురేఖావాణి. సుప్రీత

ప్రముఖ క్యారెక్టర్ యాక్టర్ సురేఖా వాణి, అమె ముద్దుల తనయ సుప్రీత మరోమారు సోషల్ మీడియా దుమ్ము దులిపేస్తున్నారు. రీసెంట్‌గా.. ఇద్దరు కలిసి వెకేషన్ వెళ్లిన వారు అక్కడ సరదాగా గడుపుతూ, ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. ఈ క్రమంలో తమ డ్రెస్సింగ్ స్టైల్‌లో హాట్ నెస్ పెంచి వీక్షకులకు అదిరే ట్రీట్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు తమ ఇన్ స్టాలో షేర్ చేయడంతో చూసిన వారంతా వారి గ్లామర్‌కు ఫిదా అవుతున్నారు. ఈ దృశ్యాలు తిలకించిన ఫాలోవర్లంతా సరిపోయారు ఇద్దరు.. సాగుతుంది మీకలాగా అంటూ సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలోని బామ డైలాగును వీరిద్దరికి అన్వయిస్తూ కామెంట్లు చేస్తునే ఒకటికి రెండు మార్లు ఆ చిత్రాలు చూసేస్తున్నారు. ప్రస్తుతం వీరి వీడియో, ఫొటోలు సామజిక మాధ్యమాల్లో బాగా ట్రెండ్ అవుతున్నాయి. వయస్సుకు సంధం లేకుండా చాలా మంది వారి ఫొటోలకు లైక్‌లు కొడుతూ మీరిలాగే కలకాలం హ్యాపీగా ఉండాలని కోరుకుంటున్నారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056